గురువారం
06-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 283
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేరాభియోగాలు రుజువైతే
ట్రంప్‌కు 136 ఏళ్ల జైలు

పోర్న్‌స్టార్‌కు చెల్లింపుల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అరెస్టయ్యారు. మంగళవారం న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ కోర్టుకు హాజరైన ట్రంప్ ముందుగా డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయంలో లొంగిపోయారు. దీంతో ట్రంప్‌ను అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నట్లు కోర్టు పరిగణించింది.

2లో

‘నిఘా’కు మోదీ
తహతహ



పెగాసస్ ‘ప్రత్యర్థి’ నుంచి పరికరాల కొనుగోలుకు భారత రక్షణ సంస్థ యోచన
పరిశీలనలో కాగ్నైట్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్

న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన కుటిల రాజకీయ నీతిని పదేపదే ప్రదర్శిస్తోంది. మోదీ ప్రభుత్వ అణచివేత పాలనపై వామపక్షాలు, ఇతర ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు, విమర్శలను కొట్టిపారేస్తూ తన నిరంకుశ, నియంతృత్వ వైఖరిని కొనసాగిస్తోంది. ప్రజాస్వామ్యయుతంగా పనిచేసే జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలపై తన నిఘాను మరింత కఠినతరం చేసేందుకు పెగాసస్ తరహా నిఘాకు కొత్త దారి వెతుకుతోంది. ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారి గొంతుకలను నొక్కేందుకు మరిన్ని అక్రమ చర్యలకు పూనుకుంటుంది.

ఇజ్రాయిల్ స్పైవేర్ సంస్థ కాగ్నైట్ నుంచి భారత రక్షణ సంస్థ ‘పెగాసస్ ప్రత్యామ్నాయంగా సమర్థవంతంగా రూపొందించిన’ పరికరాలను కొనుగోలు చేస్తుందని వాణిజ్య సమాచారాన్ని అన్వయించిన తర్వాత ‘ద హిందూ’ కథనం నివేదించింది. పెగాసస్ వివాదం దేశాన్ని కుదిపేసిన విషయం తెలిసిందే. సైనిక శ్రేణి స్పైవేర్ పెగాసస్‌ను విక్రయించే ఇజ్రాయిల్‌కు చెందిన ఎన్‌ఎస్‌ఓ గ్రూప్ కంటే తక్కువ బహిర్గతం చేసే సంస్థలు

- మిగతా 2 లో

టెన్త్ పేపర్ లీకేజీ కేసులో
బండి సంజయ్ అరెస్ట్

- ఉద్రిక్తతల మధ్య పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు
- హన్మకొండ కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- ఈ నెల 19 వరకు రిమాండ్

విశాలాంధ్ర–హైదరాబాద్/వరంగల్: తెలంగాణలో పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. బుధవారం తెల్లవారుజామున బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు టెన్త్ పేపర్ లీకేజీ కేసులో అరెస్ట్ చేశారు. హన్మకొండ మొదటి సెషన్స్ కోర్టు జడ్జి అనిత రాపోలు ఎదుట పోలీసులు ప్రవేశపెట్టారు. వాదనలు విన్న అనంతరం జడ్జి.. బండి సంజయ్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ వరకు రిమాండ్ విధించారు. బండి సంజయ్‌ను పోలీసులు కరీంనగర్ జైలుకు తరలించారు. సంజయ్‌పై కమలాపూర్ పోలీసులు తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్, 1997 లోని సెక్షన్ 5 కింద కేసు నమోదు చేశారు. ఐపీసీ 120 బీ, సెక్షన్ 420, 447, 505 సెక్షన్ల కింద కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసులో సంజయ్‌ను ఏ1గా, ఏ2గా ప్రశాంత్, ఏ3గా మహేశ్, ఏ4గా మైనర్ బాలుడు, ఏ5గా మోతం శివగణేశ్, ఏ6గా పోగు సుభాష్, ఏ7గా పోగు శశాంక్, ఏ8గా దూలం శ్రీకాంత్, ఏ9గా పెరుమాండ్ల శ్రామిక్, ఏ10గా పోతబోయిన వర్షిత్ పేర్లను చేర్చారు. మొత్తం పది మందిపై కేసులు నమోదు చేశారు. నలుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మరో

- మిగతా 2 లో

ప్రభుత్వం దిగిరాకుంటే...
చలో విజయవాడ

- మలి దశ ఉద్యమ కార్యాచరణ
- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన
- 29 వరకు దశల వారీ కార్యాచరణ
- ఏపీ జేఏసీ అమరావతి సమావేశం కీలక నిర్ణయం
- ఉద్యోగులపై సర్కారు వివక్ష : బొప్పరాజు, దామోదరరావు

2లో

జగన్ సర్కార్‌కు డేంజర్ బెల్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ట్రైలర్ చూపించాం
- పులివెందులలో జగన్‌ను ఓడిస్తాం
- నాలుగేళ్లలో అభివృద్ధి శూన్యం... అప్పులు ఘనం
- వచ్చే ఎన్నికల్లో యువతకు 40 శాతం సీట్లు
- ముందుగానే అభ్యర్థుల ప్రకటన
- ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం : వైసీపీ పాలనలో ఎస్సీలపై దాడులు పెరిగాయని, ఎస్సీలను వేధిస్తున్నారని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. విశాఖలోని వీ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న తెలుగుదేశం జోన్–1 సమీక్షా సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. అందరికీ సమాన అవకాశాలు, సమాన గౌరవం దక్కేలా

- మిగతా 2 లో

పునరావాసం, పరిహారం ముఖ్యం

- పోలవరం నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం
- సీపీఎం రౌండ్‌టేబుల్ సమావేశం విమర్శ
- రివర్స్ టెండరింగ్‌తో సాధించిందేమిటి: రామకృష్ణ

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించటం, పరిహారం చెల్లించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు డిమాండ్ చేశారు.

8లో

జూన్‌కల్లా తిరుపతి
ఐఐటీ క్యాంపస్
కేంద్ర మంత్రి సుభాస్ సర్కార్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఈ ఏడాది జూన్ 30 నాటికి తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో నిర్మాణాలన్నింటినీ సిద్ధం చేసి అప్పగిస్తామని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాస్ సర్కార్ వెల్లడించారు. రాజ్యసభలో బుధవారం వైసీపీ పార్లమెంటు సభ్యులు వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి దేశంలోని ఐఐటీలు అన్నింటికీ కలిపి 9361 కోట్ల రూపాయలు కేటాయించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో తమకు 407 కోట్ల రూపాయలు కేటాయించవలసిందిగా తిరుపతి ఐఐటీ యాజమాన్యం కోరిందని మంత్రి తెలిపారు. అయితే తిరుపతి ఐఐటీకి ఎంత మొత్తం కేటాయించాలన్న అంశం ఇంకా మంత్రిత్వశాఖ పరిశీలనలోనే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఐటీలకు కేటాయించిన 9361 కోట్ల రూపాయల నుంచే సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలు, చిన్నచిన్న పరికరాలు, లైబ్రరీ పుస్తకాలు, వడ్డీ చెల్లింపులు వంటి అంశాలు ఉన్నాయని మంత్రి చెప్పారు.

2 లక్షల అంగన్వాడీలు అప్‌గ్రేడ్

అంగన్వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు పిల్లలకు మెరుగైన పోషకాహారం అందించడం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి సేవలను బలోపేతం చేసే

- మిగతా 2 లో

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి మారుపేరు, సహనశీలి, మానవత్వం, మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిగా చిరునవ్వుల పలకరింపులతో అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొంది మాకు అదర్శంగా నిలిచిన మీరు మా నుండి దూరమైన మీ మధురస్మృతులు ప్రతిక్షణం మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుని ప్రార్థిస్తూ...
మీ దివ్య ఆశీసులతో మరియు మీ తీపి జ్ఞాపకాలతో...

కీ॥శే॥ వరికూటి మాలకొండయ్య గారి ధర్మపత్ని
కీ॥శే॥ వరికూటి కోటమ్మ గారు
జననం : 01-06-1941 మరణం : 25-03-2023

కుమారులు - కోడళ్ళు
డా॥ వరికూటి అమర్నాధ్ - శ్రీమతి జయలక్ష్మి
వరికూటి అంబేద్కర్ - శ్రీమతి సమతా దేవి
డా॥ వరికూటి అమృతపాణి - శ్రీమతి డా॥ బేబీ రాణి
అమ్మ హాస్పిటల్స్ అధినేత, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, జె.డి., ఎ & హెచ్, ప్రకాశం జిల్లా
వరికూటి వెంకట రమణారావు - శ్రీమతి రమ్య
వరికూటి అశోక్ బాబు - శ్రీమతి లక్ష్మి
వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి
కుమార్తె - అల్లుడు : శ్రీమతి విజయలక్ష్మి - వడివేలు
తోడికోడలు : విజయలక్ష్మి

కో-సన్స్ & కో- డాటర్స్
వెంకటేశ్వర్లు - అగ్నేస్ రత్న సుందరి
భారతి - వేణు
ఉదయ్ కిరణ్ - భాగ్యలక్ష్మి
కవిత - జోయ్ మనోహర్
శ్రీనివాసరావు - ఉమ
సుశీల - హనుమంతరావు
అరుణ - హనుమంతరావు
డా॥ సుబ్బారావు - డా॥ విమల

మనుమలు - మనుమరాండ్రు
డా॥ సంజయ్ - సురేఖ
రాహుల్ - విద్య
జగదీష్ - నీరజ
డా॥ హిమబిందు - డా॥ కామరాజు
భరత్
డా॥ స్నేహ
డా॥ జ్యోత్స్న - డా॥ కిరీటి
డా॥ విద్య
రఘురామ్ - జాహ్నవి
వెన్నెల, విక్రమ్
సిద్దార్థ - నేహ
గౌతమ్, శ్రీతేజ

ముని మనుమలు - మనుమరాండ్రు
రేష్మ మృణాళిని, హర్షిత్, యశ్వంత్, వరుణ్, రోహన్, జీవిత, జోనాధన్, జస్టిన్, రూపశ్రీ, సోహిణి, శ్రీరామ్, లక్ష్మీరోచన్, అద్వైత్, అభిషిక్త, ఆర్య, కేతన, గదాధర్, సాత్విక్, కార్తీక్, నివేద, చైత్య

పెద్దకర్మ : తేది : 06-04-2023 గురువారం ఉదయం : 11-00 గం॥లకు టంగుటూరు (మం), కారుమంచి గ్రామములోని మాస్వగృహము నందు జరుగును.

నేరాభియోగాలు రుజువైతే

ట్రంప్‌కు 136 ఏళ్ల జైలు

న్యూయార్క్: పోర్న్‌స్టార్‌కు చెల్లింపుల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అరెస్టయ్యారు. మంగళవారం న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ కోర్టుకు హాజరైన ట్రంప్ ముందుగా డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయంలో లొంగిపోయారు. దీంతో ట్రంప్‌ను అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నట్టు కోర్టు పరిగణించింది. విచారణ అనంతరం కోర్టు ఆయనను కస్టడీ నుంచి విడుదల చేసింది. డిసెంబర్ 4న మరోసారి ఆయనను కోర్టు విచారించనుంది. హష్ మనీతోపాటు మొత్తంగా ట్రంప్‌పై 34 నేర అభియోగాలు నమోదయ్యాయి. ఇవిగనక రుజువై ట్రంప్ దోషిగా తేలితే... దాదాపు 136 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నట్లు న్యాయ నిపుణులు చెబుతున్నారు. నిజానికి ఒకవేళ ట్రంప్ దోషిగా తేలినా.. అంత శిక్ష వేయకపోవచ్చు అన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

మన దేశం నాశనం అవుతోంది: ట్రంప్

తనపై క్రిమినల్ అభియోగాలు మోపడం అమెరికాకే అవమానమని ట్రంప్ పేర్కొన్నారు. కోర్టు నుంచి వెళ్లిన తర్వాత ఫ్లోరిడాలోని తన నివాసం వద్ద మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ... మన దేశం నాశనం అవుతోంది... నరకానికి వెళ్తోందంటూ బైడెన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అఫ్గానిస్థాన్ నుంచి మన బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత ప్రపంచం మనల్ని చూసి నవ్వుతోందని విమర్శించారు. మనం మన దేశాన్ని రక్షించుకోవాలి. అమెరికాలో ఇలాంటివి జరుగుతాయని తానెప్పుడూ అనుకోలేదన్నారు. ఇది దేశానికి అవమానం అని చెప్పారు. దేశాన్ని నాశనం చేయాలనుకునేవారి నుంచి రక్షించేందుకు ప్రయత్నించడమే తాను చేసిన నేరమని వెల్లడించారు. తనపై ఈ తప్పుడు కేసు పెట్టారని, వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అసలు కేసు ఏంటంటే?

ట్రంప్‌తో తనకు శారీరక బంధం ఉందని, 2006లో ఓ హోటల్‌లో తామిద్దరం ఏకాంతంగా కలిశామని పోర్న్‌స్టార్ స్టార్మీ ఆరోపిస్తున్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఈ విషయాన్ని బయటపెట్టకుండా తనతో ట్రంప్ ఒప్పందం చేసుకొని డబ్బును చెల్లించారన్నారు. ఈ చెల్లింపులను వ్యాపార ఖర్చుగా చూపించారు. ఇలా బిజినెస్ రికార్డులను తప్పుగా చూపించడమే ఇప్పుడు ట్రంప్‌పై అభియోగం.

ట్రంప్‌కు రూ.కోటి చెల్లించండి

శృంగార తారకు కోర్టు ఆదేశం

కాలిఫోర్నియా: శృంగార తార స్టార్మీ డేనియల్స్ అనైతిక ఆర్థిక ఒప్పందం కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అరెస్టయ్యి, విడుదలైన విషయం తెలిసిందే. అనైతిక ఆర్థిక ఒప్పందం కేసులో ఆయనపై నమోదైన అభియోగాలపై న్యూయార్క్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో ట్రంప్‌పై వేసిన పరువునష్టం కేసులో మాత్రం డేనియల్స్‌కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలోని 9వ యూఎస్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్... డేనియల్స్ వాదనను తోసిపుచ్చింది. దీంతో కోర్టు ఫీజులో భాగంగా ట్రంప్ తరఫు న్యాయవాదులకు లక్షా 20వేల డాలర్లు (సుమారు రూ.కోటి) చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. మన్‌హటన్ న్యాయస్థానంలో ట్రంప్ హాజరైన రోజే మరో కోర్టులో ఆయనకు అనుకూలంగా ఈ తీర్పు రావడం గమనార్హం. ట్రంప్ అరెస్టుకు, ఈ సివిల్ కేసుకు సంబంధం లేనప్పటికీ రెండు కూడా స్టార్మీ డేనియల్స్‌కు సంబంధించినవే. అయితే, గతంలో ట్రంప్‌పై ఆమె చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. కేవలం డబ్బు కోసమే ఇలాంటి బెదిరింపు ఆరోపణలు చేస్తోందని మాజీ అధ్యక్షుడు దుయ్యబట్టారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై డేనియల్స్ 2018లో కోర్టును ఆశ్రయించారు. ఈ పరువునష్టం కేసులో స్టార్మీ డేనియల్స్ ఓడిపోవడంతోపాటు లీగల్ ఫీజు కింద ఆమె 2.93లక్షల డాలర్లు చెల్లించాలని స్థానిక కోర్టు ఆదేశించింది. అనంతరం పై కోర్టులో అప్పీలు చేసుకోగా... అక్కడ కూడా మరో 2.45లక్షలు జరిమానా పడింది. తాజా అప్పీలులోనూ స్టార్మీ డేనియల్స్‌కు చుక్కెదురయ్యింది. దీంతో మొత్తంగా ఆమె దాదాపు 6లక్షల డాలర్లకుపైగా ట్రంప్ తరఫు అటార్నీలకు చెల్లించాల్సి ఉంటుంది.

మే6న బ్రిటన్ రాజు పట్టాభిషేకం

లండన్: డెబ్బై ఏళ్లపాటు బ్రిటన్‌ను పాలించిన క్వీన్ ఎలిజబెత్-2 గతేడాది సెప్టెంబర్‌లో కన్నుమూయడంతో తదుపరి రాజుగా ఛార్లెస్-3 బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మే 6వ తేదీన బ్రిటన్ రాజుగా ఛార్లెస్-3 పట్టాభిషేకం జరగనుంది. ఈ మేరకు రాజవంశం అధికారికంగా ప్రకటించింది. లండన్ లోని వెస్ట్ మినిస్టర్ అబే లో మే 6వ తేదీన బ్రిటన్ రాజు ఛార్లెస్ పట్టాభిషేక కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఆదే సమయంలో క్వీన్ కాన్సార్ట్ కెమిల్లా కిరీట ధారణ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. కార్యక్రమం అనంతరం ఆ తర్వాతి రోజున విండ్సర్ క్యాజిల్‌లో కూడా పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి సామాన్య ప్రజలను కూడా అనుమతించనున్నారు. ఛార్లెస్-3, కెమిల్లా దంపతుల అధికారికంగా జరగనున్న ఈ పట్టాభిషేక మహోత్సవానికి 2వేల మందిని ఆహ్వానించనున్నట్లు సమాచారం. కాగా పట్టాభిషేకం కార్యక్రమంలో కోహినూర్ వజ్రాన్ని వినియోగించకూడదని రాజవంశం నిర్ణయించింది. వలస రాజ్యాల పాలనకు గుర్తుగా బ్రిటన్ రాచకుటుంబం చేతిలో ఉన్న వివాదాస్పద కోహినూర్ వజ్రం లేని కిరీటంతోనే తన భర్త, కింగ్ ఛార్లెస్-3 పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనాలని బ్రిటన్ రాణి కెమిల్లా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ఇప్పటికే బకింగ్‌హాం ప్యాలెస్ వర్గాలు అధికారికంగా వెల్లడించాయి.

9 బిలియన్ల డాలర్ల పరిహారం చెల్లింపునకు

జాన్సన్ కంపెనీ ప్రతిపాదన

న్యూయార్క్: ఒకప్పుడు జాన్సన్ కంపెనీ టాల్కమ్ పౌడర్‌కు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉండేది. ఇప్పుడా ఉత్పత్తులు ఎక్కడా లభించడం లేదు కానీ ఆ కంపెనీపై వేసిన కేసులు కోర్టుల్లోనే ఉన్నాయి. ఆ కంపెనీకి చెందిన బేబీ పౌడం తో పాటు ఇతర ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్ వచ్చినట్లు వేలాది మంది కేసులు దాఖలు చేశారు. దీంతో ఆ కంపెనీ ఓ భారీ ప్రతిపాదన చేసింది. దివాళా కోర్టును ఆశ్రయించిన ఆ కంపెనీ... మొత్తం కేసుల పరిష్కారం కోసం 9 బిలియన్ల డాలర్లు చెల్లించనున్నట్లు తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఒక్క అమెరికాలోనే సుమారు 40 వేల కేసులు జాన్సన్ కంపెనీపై ఉన్నట్లు తెలుస్తోంది. తమ కంపెనీపై వేసిన కేసుల్ని విలువైనవే అని గుర్తిస్తున్నట్లు చెప్పిన ఆ కంపెనీ... న్యాయపోరాటంలో భాగంగా సెటిల్మెంట్‌ను పెంచినట్లు అంగీకరించింది. గతంలో రెండు బిలియన్ల డాలర్లు ఇస్తానని చెప్పిన ఆ కంపెనీ ఇప్పుడు తన సెటిల్మెంట్‌ను 9 బిలియన్ల డాలర్లకు పెంచడం గమనార్హం. జాన్సన్ కంపెనీపై కేసు వేసిన 40 వేల మంది.. ఆ కంపెనీ ఉత్పత్తుల్లో క్యాన్సర్‌కు కారణమైన అస్‌బెస్టాస్ ఉన్నట్లు ఆరోపణలు చేశారు. 2020 నుంచే అమెరికాలో ఆ కంపెనీకి చెందిన టాల్కమ్ పౌడర్ అమ్మకాలను ఆపేశారు. ఇక గత ఏడాది నుంచి ప్రపంచవ్యాప్తంగా తమ ఉత్పత్తుల అమ్మకాన్ని ఆ కంపెనీ నిలిపివేసింది. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ దాదాపు 130 ఏళ్ల నుంచి తమ ఉత్పత్తుల్ని విక్రయిస్తోంది.

ప్రభుత్వం దిగిరాకుంటే

చలో విజయవాడ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంపై జగన్ ప్రభుత్వం దిగిరావాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి చలో విజయవాడకు శ్రీకారం చుడతామని ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించింది. విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి.ఫణిపేర్రాజు, కోశాధికారి వి.వి.మురళీకృష్ణం నాయుడు, అన్ని జిల్లాల అనుబంధ సంఘాల నాయకులు హాజరయ్యారు. అనంతరం సమావేశ నిర్ణయాలను మీడియాకు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు వెల్లడించారు. మొదటి దశ ఉద్యమ కార్యాచరణతో ప్రభుత్వం స్పందించనందున... బుధవారం (ఈనెల 5వ తేదీ) నుంచి 29 వరకు రెండో దశ ఉద్యమ కార్యాచరణకు దిగామని, ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కొనసాగిస్తారని వెల్లడించారు. అప్పటికీ స్పందించకుంటే... మూడో దశ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు.

ఉద్యోగులకు సంబంధించిన ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగించాలని సమావేశం నిర్ణయించందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నాయకత్వానికి ఉద్యోగుల అందరి మద్దతు ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణే మలిదశ ఉద్యమ కార్యాచరణకు ప్రధాన కారణమన్నారు. తమ డిమాండ్లు సాధించేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని, 11వ పీఆర్సీ ప్రతిపాదించిన పే స్కేళ్లను బయట పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, మూడు కొత్త డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పే రివిజన్ కమిషన్ నియమించాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, ఈహెచ్‌ఎస్ ద్వారా క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ అమలు చేయాలని, కొత్త జిల్లా కేంద్రాలన్నిటిలోనూ 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏపీ జేఏసీ అమరావతి మలిదశ ఉద్యమ కార్యాచరణ ఇలా...

- ఈనెల 5 నుంచి 29 వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు
- 8వ తేదీ నుంచి అన్ని ముఖ్యమైన కూడళ్లలో నల్ల కండువాలు ధరించి డిమాండ్ల పోస్టర్లు విడుదల
- 10న అన్ని జిల్లాల్లోని స్పందనలో నల్ల మాస్కులు ధరించి 'జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాల అందజేత
- 11న ఒక్కరోజు సెల్ ఫోన్ డౌన్ నిర్వహణ
- 12న 26 జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద వారి సమస్యలపై ధర్నా
- 15న మరణించిన, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శ
- 18న అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ధర్నాలు
- 20వ తేదీన ఉద్యోగుల వేతనాలు 1వ తేదీన రానందుకు నిరసనగా ఇఎంఐ చెల్లింపులపై ఒత్తిడి తేవద్దని, అపరాధ రుసుం వేయవద్దని బ్యాంకుల సందర్శన
- 25న అన్ని జిల్లాలలో కలెక్టరేట్ల వద్ద కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యపై ధర్నాలు
- 27న సకాలంలో పెన్షన్లు రాని రిటైర్డు ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి పరామర్శలు
- 29న అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఉద్యోగుల సమస్యలపై ధర్నాలు

ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.కృష్ణమోహన్, ఆర్.వసంతరాయులు, యూనియన్ నాయకులు బి.కిశోర్, ఎస్.మల్లేశ్వరరావు, శివారెడ్డి, మహిళా నాయకులు జ్యోతి, ఏపీ జేఏసీ అనుబంధ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, 26 జిల్లాల చైర్మన్లు పాల్గొన్నారు.

ఈ పిటిషన్ విచారించలేం

దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై సుప్రీం స్పష్టీకరణ

ప్రతిపక్షాలకు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: రాజకీయ కుట్రలో భాగంగా సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతృత్వంలో 14 రాజకీయ పార్టీలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ కేసులో వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా సాధారణ మార్గదర్శకాలు రూపొందించడం ప్రమాదకరమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2014లో మోదీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష పార్టీలు మూకుమ్మడిగా ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకుని ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో కేసులు నమోదు చేస్తున్నారని ఆ పార్టీలు ఆరోపించాయి. అయితే బుధవారం ఈ పిటిషన్‌ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్.. దీని విచారణ అర్హతపై అనుమానాలు వ్యక్తం చేశారు. 'కేసుల దర్యాప్తులు, విచారణల నుంచి విపక్ష నేతలకు రక్షణ కల్పించేందుకు ఈ పిటిషన్ వేశారా? వారికి ఏమైనా ప్రత్యేక హక్కులు ఉన్నాయా' అని ప్రతిపక్షాల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని సీజేఐ ప్రశ్నించారు. దీనికి సింఘ్వీ స్పందిస్తూ తాము ఎలాంటి రక్షణ గానీ, మినహాయింపులు గానీ కోరడం లేదని తెలిపారు. అయితే ప్రతిపక్షాల స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే కేంద్రం ఆ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. చట్ట ప్రకారం పారదర్శక దర్యాప్తును తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. అయితే సింఘ్వీ వాదనను సీజేఐ అంగీకరించలేదు. 'ఈ పిటిషన్ ప్రత్యేకంగా రాజకీయ నాయకులు వేశారు. అవినీతి ఆరోపణలు, నేరాభియోగాలు ఎదుర్కొంటున్న ఇతర సామాన్య పౌరుల అభిప్రాయాలను ఇక్కడ పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పిటిషన్‌లో చేసిన ఆరోపణలను ధ్రువీకరించేలా ఒక్క కేసును కూడా పేర్కొనలేదు. అలాంటప్పుడు కేవలం రాజకీయ నాయకుల కోసం వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా సాధారణ మార్గదర్శకాలు జారీ చేయడం ప్రమాదకరంగా మారుతుంది. ఈ పిటిషన్‌ను మేం విచారించలేం' అని సీజేఐ స్పష్టం చేశారు.

బండి సంజయ్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

నలుగురు పరారీలో ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు.

లీకేజీలో ప్రధాన సూత్రధారి బండి సంజయే: వరంగల్ సీపీ

టెన్త్ హిందీ పేపర్ లీకేజీలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, బీజేపీ కార్యకర్త ప్రశాంత్ కీలకంగా వ్యవహరించారని వరంగల్ సీపీ రంగనాథ్ పేర్కొన్నారు. వీరిద్దరూ సోమవారం సాయంత్రం నుంచే వాట్సాప్ చాటింగ్, వాట్సాప్ కాల్స్ తరుచూ మాట్లాడుకున్నారు. ఆ తర్వాతే హిందీ పేపర్ లీకేజీకి కుట్ర చేశారని సీపీ తెలిపారు. ఈ కేసులో బండి సంజయ్‌ను కోర్టులో హాజరుపరిచామని సీపీ పేర్కొన్నారు. రిమాండ్ రిపోర్టులో బండి సంజయ్‌ను ఏ1గా, ఏ2గా ప్రశాంత్‌ను చేర్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం నలుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. బూర ప్రశాంత్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. హిందీ ప్రశ్నపత్రం కమలాపూర్ బాయ్స్ స్కూల్ నుంచి బయటకు వచ్చిందని సీపీ స్పష్టం చేశారు. మొదటగా ఉదయం 11:18 గంటలకు ప్రశాంత్ ప్రశ్నపత్రాన్ని ఫోటో తీసి వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేశారు. 11:24 గంటలకు బండి సంజయ్‌కు ఫార్వార్డ్ చేశారు. తర్వాత చాలా మందికి ఫార్వార్డ్ అయిందని తెలిపారు. ప్రశాంత్‌తో పాటు మహేశ్ కూడా చాలా మందికి పంపించారు. ఈటల రాజేందర్, ఆయన పీఏకి కూడా పంపించారని, వాట్సాప్‌లో ప్రశ్నపత్రాన్ని ఫార్వార్డ్ చేసిన తర్వాత ప్రశాంత్ 149 మందికి కాల్ చేసినట్లు సీపీ స్పష్టం చేశారు.

బీజేపీ హెబియస్ కార్పస్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్‌ను నిరసిస్తూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. గురువారం ఉదయం ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరగనుంది. అయితే హౌస్ మోషన్ విచారణకు హైకోర్టు నిరాకరించింది. రెగ్యులర్ విచారణ జరుపుతామని న్యాయస్థానం తెలిపింది. బండి సంజయ్ అక్రమ అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ హైకోర్టులో తెలంగాణ బీజేపీ లీగల్ సెల్ హెబియస్ కార్పస్ పిటిషన్‌ను దాఖలు చేసింది. మొత్తం ఆరుగురిని బీజేపీ ప్రతివాదులుగా చేర్చింది. హోంశాఖ కార్యదర్శి, డీజీపీ, కరీంనగర్ రాచకొండ సీపీలు, బొమ్మలరామారం సీఐలను ప్రతివాదులుగా చేర్చుతూ బీజేపీ పిటిషన్‌ను దాఖలు చేసింది. బండి సంజయ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, అరెస్టు సమయంలో పాటించాల్సిన కనీస నిబంధనలు పోలీసులు పాటించలేదని పేర్కొన్నారు. అరెస్టు విషయాన్ని కుటుంబ సభ్యులకు గానీ పార్టీకి గాని పోలీసులు వెల్లడించలేదని తెలిపారు. సీఆర్పీసీ 50 కింద అరెస్టు విషయాన్ని తప్పనిసరిగా కుటుంబ సభ్యులకి చెప్పాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన అత్తగారి కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉన్నందున బండి సంజయ్ కరీంనగర్‌కు వెళ్లారని రాత్రి 11:30 నిమిషాలకు అక్రమంగా బండి సంజయన్‌ను అరెస్టు చేశారని పిటిషన్‌లో బీజేపీ పేర్కొంది. పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు గురువారం విచారణ జరుపనుంది.

'నిఘా'కు మోదీ తహతహ

(మొదటిపేజీ తరువాయి)

విక్రయించే కొత్త స్పైవేర్‌ల కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం 120 మిలియన్ డాలర్లు (రూ.986 కోట్లకు పైగా) ఖర్చు చేయాలని చూస్తున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక తెలిపిన కొద్ది రోజుల తర్వాత ఈ నివేదిక వచ్చింది. రక్షణ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్న సంస్థలలో కాగ్నైట్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ ఒకటి అని నివేదిక పేర్కొంది. అయితే దీనిపై చేసిన అభ్యర్థనపై రక్షణ మంత్రిత్వ శాఖ స్పందించలేదు. కాగా, 'సర్వేలెన్స్ ఫర్ హైర్' పరిశ్రమపై ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా వేదిక ద్వారా 'బెదిరింపు నివేదిక'ను సూచిస్తోంది. 'కాగ్నైట్ క్రమం తప్పకుండా జర్నలిస్టులు, అసమ్మతివాదులు, నిరంకుశ పాలనల విమర్శకులు, ప్రతిపక్ష కుటుంబాలు, ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల కార్యకర్తలను వారికి తెలియకుండానే లక్ష్యంగా చేసుకుంటుంది. వారి సమాచారాన్ని బహిర్గతం చేయడానికి లేదా వారి పరికరాలు, ఖాతాలను రాజీ చేయడం ద్వారా ఈ వ్యక్తులపై నిఘాను సేకరించింది. అయితే భారత సైన్యం వద్ద స్మార్ట్‌ఫోన్‌ల వంటి ఎండ్ పాయింట్ కమ్యూనికేషన్‌ను పర్యవేక్షించగల పరికరాలు ఏవీ లేవని అజ్ఞాత పరిస్థితిపై రక్షణ వర్గాలు తెలిపాయి. మూడు సంవత్సరాలుగా రక్షణ నిఘా సంస్థ (డీఐఏ) పరిధిలోకి వచ్చే సిగ్నల్ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (ఎస్‌ఐడీ) కాగ్నైట్, దాని అప్పటి మాతృ సంస్థ వెరింట్ సిస్టమ్స్ ఇంటర్నేషనల్ కంప్యూటర్ గేర్‌లను సరఫరా చేస్తున్నాయని హిందూ నివేదిక పేర్కొంది. ఎస్‌ఐడీలో సైనిక, నావిక, వైమానిక దళ సిబ్బంది ఉన్నారు. నివేదిక ప్రకారం, జమ్ముకశ్మీర్, అసోంతో సహా ఈశాన్య రాష్ట్రాలలోని సేవా ప్రాంతాల కోసం ఏదైనా కంప్యూటర్ వనరులో ఉత్పత్తి చేయబడిన, ప్రసారం చేయబడిన, స్వీకరించబడిన లేదా నిల్వ చేయబడిన ఏదైనా సమాచారాన్ని అడ్డగించడానికి, పర్యవేక్షించడానికి, సందేశాన్ని అర్థమయ్యేలా చేయడానికి దీనికి అనుమతి ఉంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఎస్‌ఐడీ ద్వారా ఏ రకమైన ఇతర దిగుమతులు కూడా కస్టమ్స్ డేటాలో లాగిన్ కాలేదు. సంస్థ నుంచి ఒక ఉత్పత్తి ఈ సంవత్సరం జనవరిలో ఇటీవల తీసుకువచ్చారు. నివేదికలో కొనుగోలు చేసిన పరికరాలకు సంబంధించిన మరిన్ని వివరాలు లేవు. ఈ పరికరాలు వాడుకలో ఉన్న కమ్యూనికేషన్ పరికరాలకు సంబంధించిన కార్డ్‌లు, ఎన్‌క్రిప్టెడ్ పరికరాలకు సంబంధించినవి కావు. ఈ నివేదికపై కాగ్నిట్ స్పందించలేదు. ఇదిలాఉండగా, ఫర్బిడెన్ స్టోరీస్ కన్సార్టియం ఆఫ్ జర్నలిస్టుల నివేదిక ప్రకారం పెగాసస్ స్పైవేర్ భారత కార్యకర్తలు, జర్నలిస్టులు, రాజకీయ నాయకులపై ఉపయోగించబడింది. స్పైవేర్‌ను కొనుగోలు చేసినట్లు భారత ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించలేదు లేదా అంగీకరించలేదు. 2022 చివరిలో ఆర్గనైజ్డ్ క్రైమ్, కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) నివేదిక ప్రకారం, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), భారతదేశ దేశీయ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ఇజ్రాయెలీ ఎన్‌ఎస్‌వో గ్రూప్ నుంచి హార్డ్‌వేర్‌ను కొనుగోలు చేసినట్లు దిగుమతి పత్రాలు చూపించాయి. ఇది పెగాసస్ స్పైవేర్‌ను అమలు చేయడానికి ఉపయోగించే పరికరాల వివరణకు సరిపోలుతుంది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ భద్రతా ల్యాబ్ వివిధ పరికరాలపై ఫోరెన్సిక్ పరీక్షలలో కొంతమంది కార్యకర్తలు, జర్నలిస్టుల ఫోన్‌లలో స్పైవేర్ క్రియాశీలకంగా ఉందని తెలిపింది.

40 మంది కేంద్ర సాయుధ దళాలు మరణించిన పుల్వామా ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి ముదాసిర్ అహ్మద్ ఖాన్‌ను పట్టుకోవడానికి వారు వాట్సాప్‌లో పంపిన హానికరమైన లింక్‌ను ఉపయోగించారని పేర్కొంటూ, ఏజెన్సీ స్పైవేర్‌ను ఉపయోగించడాన్ని వివరించిన పేరు తెలియని ఎస్‌ఐడీ అధికారిని ఉటంకిస్తూ 'ది వీక్ మ్యాగ్‌జైన్' పేర్కొంది. సుప్రీం కోర్టులో మోదీ ప్రభుత్వం 'జాతీయ భద్రత'ను ఉదహరించింది. పెగాసస్‌ను ఉపయోగిస్తుందో లేదో వెల్లడించలేమని పేర్కొంది. కాగా గత సంవత్సరం ఫర్బిడెన్ స్టోరీస్ కన్సార్టియంలో భాగం కాని న్యూయార్క్ టైమ్స్, 2017లో విస్తృత 2 బిలియన్ డాలర్ల రక్షణ ఒప్పందంలో భాగంగా భారతదేశం ఇజ్రాయెల్ నుంచి పెగాసస్‌ను నిజంగా కొనుగోలు చేసిందని జెరూసలేం నుంచి నివేదించింది.

జూన్‌కల్లా తిరుపతి ఐఐటీ క్యాంపస్

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంతో ఏడాదికి 40 వేల చొప్పున దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 2 లక్షల అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ ఎంపీ అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఈ ఏడాది ఆశావహ జిల్లాల పరిధిలో 40 వేల అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయబోతున్నట్లు ఆమె చెప్పారు. అంగన్వాడీల్లో ఇంటర్నెట్, వైఫై, ఎల్‌ఈడీ స్క్రీన్లు, స్మార్ట్ లెర్నింగ్, ఆడియో విజువల్ పరికరాలు, చైల్డ్-ఫ్రెండ్లీ లెర్నింగ్ పరికరాలను సమకూర్చనున్నట్లు తెలిపారు. అలాగే న్యూట్రిషన్, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)లకు సమాన ప్రాధాన్యత కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు తమ ప్రతిపాదనలు పంపవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఎన్ని అంగన్వాడీ కేంద్రాలు, ఎన్ని మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయన్న మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ 6837 మినీ అంగన్వాడీ కేంద్రాలు, 48,770 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలతో కలిపి మొత్తం 55,607 కేంద్రాలు ఉన్నట్లు మంత్రి జవాబిచ్చారు.

జగన్ సర్కార్‌కు డేంజర్ బెల్

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీ పని చేసిందని గుర్తు చేశారు. ఎస్సీలు అభివృద్ధి చెందాలంటే సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని ఆయన అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తితోనే తెలుగుదేశం పార్టీ పని చేస్తోందని తెలిపారు. మొన్న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ట్రైలర్ చూపించామన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన వేపాడ చిరంజీవిని, చివరి నిమిషంలో టికెట్ మార్పునకు సహకరించిన చిన్ని లక్ష్మీకుమారిని చంద్రబాబు సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఒక గెలుపు ఉత్సాహం ఇస్తుందని, ఓటమి కుంగదీస్తుందని తెలిపారు. ఆఖరికి కడపలో కూడా గెలిచామని, ఒక దెబ్బకి జగన్ మీటింగ్ పెట్టాడని అన్నారు. ఇంతకు ముందు ఎమ్మెల్యేలను బానిసలుగా చూశాడని, ఇప్పుడు ఎవరినీ వదులుకోనని ఎమ్మెల్యేలను బతిమాలుతున్నాడన్నారు. జగన్‌కు డేంజర్ బెల్ మోగిందని, మేం తలచుకుంటే తాడేపల్లి ప్యాలెస్ కూల్చడం ఎంతసేపు అన్నారు. విశాఖ జోన్ సమావేశం విజయవంతం అయిందని, నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ స్పందనను చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో గెలిచేది టీడీపీనే అని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ అంటున్నట్లు వై నాట్ 175 కాదు, ఇప్పుడు చెబుతున్నా వై నాట్ పులివెందుల అని బాబు ఘటుగా చెప్పారు. పులివెందులలో జగన్‌ను ఓడిస్తామన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో వచ్చిన తీర్పునకు కూడా జగన్ వక్రభాష్యం చెప్పాడని, ఓటమిని ఒప్పుకోని మనస్తత్వం ఉన్న వ్యక్తి జగన్ అన్నారు. నాలుగేళ్లలో జగన్ ఉత్తరాంధ్రకు ఏం చేశాడో చెప్పగలడా అని ప్రశ్నించారు. టీడీపీ గెలిచి ఉంటే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం పూర్తయ్యేవని, వంశధార, నాగావళి అనుసంధానం పూర్తయి ఉంటే ఈ మూడు జిల్లాల్లో నీటి ఎద్దడి లేకుండా ఉండేదన్నారు. ఉత్తరాంధ్రలో ఇరిగేషన్‌పై రూ.1,600 కోట్లు ఖర్చు పెడితే, ఈ ప్రభుత్వం కనీసం రూ.400 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. నాడు తీసుకున్న నిర్ణయాల వల్ల తెలంగాణ ఇప్పుడు ఆదాయంలో అగ్రశ్రేణికి చేరిందని, ఏపీ మాత్రం అప్పుల్లో మునిగిపోయిందన్నారు. విశాఖలో జీ20 సమావేశాల సందర్భంగా తాము నాటిన చెట్లకు రంగులేసుకున్న వైసీపీ నేతల వైఖరిని విశాఖ ప్రజలు గుర్తించారన్నారు. రిషికొండకు గుండు కొట్టేశారని అన్నారు. నాడు భోగాపురం విమాశ్రయం కోసం 97 శాతం భూసేకరణ పూర్తి చేశామని, నాలుగేళ్లయినా జగన్ ఒక్క ఇటుక వెయ్యలేదన్నారు. తాము విశాఖలో మెడ్‌టెక్ జోన్ తీసుకువచ్చామని, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ కంపెనీని తీసుకువస్తే దాన్నీ ఈ ప్రభుత్వం తరిమేసిందన్నారు. విశాఖ ఒక సుందరమైన నగరమని, దీన్ని ఆర్థిక రాజధానిగా, ఐటీ హబ్‌గా చేయాలని ప్రయత్నం చేశామని చంద్రబాబు తెలిపారు. విశాఖలో ఐదేళ్లలో మూడు సార్లు సీఐఐ సదస్సులు నిర్వహించి, రూ.16 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు చేసుకున్నామని అన్నారు. పోలవరం ముంపు బాధితులకు డబ్బులు ఇవ్వలేదని, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టును జగన్ పూర్తి చెయ్యలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబరు 3 ద్వారా స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు అనే ఉత్తర్వు ఇప్పుడు పోయిందని, దీనిపై వచ్చిన న్యాయపరమైన సమస్యల్లో ప్రభుత్వం పోరాడలేదని ఆరోపించారు. నాడు గిరిజన ప్రాంతాల్లో బైక్ అంబులెన్స్‌లు పెట్టామని, ఇప్పుడు అవన్నీ అందుబాటులో లేకుండా పోయాయన్నారు. దీంతో అడవిలోనే కాన్పులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ నుంచి దొంగ దారిన లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వి తీసుకువెళుతున్నారు. రాష్ట్రంలో మద్యనిషేధం చేస్తానని చెప్పిన జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున ఇసుక మాఫియాను నడిపిస్తున్నారని ఆరోపించారు. ఒక్క విశాఖపట్నంలోనే రూ.40 వేల కోట్ల ఆస్తులను వైసీపీ నేతలు రాయించుకున్నారని చంద్రబాబు మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సిట్ ఏర్పాటు చేసి లాక్కున్న భూములన్నీ తిరిగి ఇప్పిస్తామన్నారు. జగన్ రెడ్డీ నీ బంధువు అనీల్ రెడ్డికి విశాఖలో ఏం పని... ఇక్కడ ఒక వ్యక్తికి చెందిన 50 ఎకరాల భూమి కొట్టేశాడని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి కల్చర్, గన్ కల్చర్ వచ్చిందంటే మనం సిగ్గు పడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని, పన్నులు వేశారని, ఒక్క రోడ్డు వేయలేదని, ఒక్క ప్రాజెక్టూ కట్టలేదని, ఒక్క పరిశ్రమ తేలేదన్నారు. మరి ఆ నిధులన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఢిల్లీ మెడలు వంచుతా అని చెప్పిన ముఖ్యమంత్రి ఢిల్లీ ఎందుకు వెళుతున్నాడని, ప్రత్యేక హోదా వచ్చిందా, గిరిజన యూనివర్సిటీ ప్రారంభం అయిందా, పోలవరం పూర్తయిందా, రైల్వే జోన్ డిమాండ్ పూర్తిగా నెరవేరిందా అని చంద్రబాబు ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, నాయకులు అయ్యన్నపాత్రుడు, కళా వెంకట రావు, చినరాజప్ప, గంట శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లాల సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

బడుగు వర్గాలకు దిక్సూచి జగ్జీవన్‌రామ్

- కేంద్రమంత్రిగా విప్లవాత్మక చర్యలు
- ఒకే నియోజకవర్గం నుంచి 10సార్లు గెలుపొందిన నేత
- జయంతి వేడుకల్లో మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బడుగు, బలహీన వర్గాలకు దిక్సూచి, దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగిన వ్యక్తి భారతదేశ మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబు జగ్జీవన్ రామ్ అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ 115వ జయంతి మహోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అత్యంత వేడుకగా నిర్వహించారు. ముందుగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ చిన్ననాటి నుంచే అనేక ఒడిదుడుకులు అధిగమించి భారత రాజకీయాలను ఒంటిచేత్తో నడిపించిన దార్శనికుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కేంద్రమంత్రి పదవులను సమర్థవంతంగా నిర్వహించటమే కాకుండా మంత్రిగా అనేక విప్లవాత్మక చర్యలకు నాంది పలికి తనదైన ముద్ర వేశారని గుర్తుచేసుకున్నారు. పేదలకు చదువు విలువ చెప్పడమే కాకుండా వారికి అవగాహన కల్పించడంలో ప్రముఖ పాత్ర వహించిన ఘనత బాబు జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు. నేటి తరం బాబు జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పూలే, జగ్జీవన్ రామ్ తదితరుల ఆలోచనా విధానాన్ని అందిపుచ్చుకుని జగనన్న ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నదని కొనియాడారు. కడుపులో బిడ్డ నుంచి అవ్వల వరకు ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అందేలా చర్యలు తీసుకోవటం శుభపరిణామమన్నారు. సభకు అధ్యక్షత వహించిన విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశ యువతకు స్ఫూర్తి ప్రదాత అని, ఆయన జీవిత చరిత్రను యువత తెలుసుకోవాలని కోరారు. దేశంలో నాడు నెలకొన్న వివక్షపై పోరాడిన యోధుడని కొనియాడారు. అన్ని వర్గాలను సంఘటిత పరిచిన గొప్ప దార్శనికుడన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో సామాజిక న్యాయం పాటిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సబ్‌ప్లాన్‌కు రూ.20 వేల కోట్లు కేటాయించటం సంతోషకరమన్నారు. బాపట్ల లోక్‌సభ సభ్యులు నందిగం సురేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, ఆర్థిక భద్రత పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆర్థికంగా ఇబ్బంది లేకుంటే పేద విద్యార్థుల చదువులకు ఆటంకం ఉండదని వివరించారు. శాసన మండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ కుల వివక్షను ఎదుర్కొంటూ, సమానత్వంపై పోరాడుతూ 50 సంవత్సరాలు పార్లమెంటేరియన్‌గా, 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగాగా కొనసాగటం సాధారణ మానవులకు సాధ్యం కాదని, కానీ బాబు జగ్జీవన్ రామ్ అన్ని సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని విజేతగా నిలిచారన్నారు. కేంద్రమంత్రిగా నాటి రోజుల్లోనే విప్లవాత్మక నిర్ణయాలను అమలు చేశారని, టెలిఫోన్ అంటే తెలియని రోజుల్లోనే జిల్లాకు ఒక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రధాని అయ్యే అవకాశం రెండుసార్లు వచ్చిందని, అదీ బాబు జగ్జీవన్ రామ్ గొప్పతనమన్నారు. విజయవాడ (పశ్చిమ) శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, ఏపీ మాల సంక్షేమ సహకార ఆర్థికసంఘం లిమిటెడ్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

రబీ ధాన్యం సేకరణపై అఖిలపక్షం వేయాలి

మంత్రి కారుమూరికి కేవీవీ ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రబీ ధాన్యం సేకరణ సమస్యలపై చర్చించడానికి అఖిలపక్ష రైతుసంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు బుధవారం ఆయన ఈ మేరకు లేఖ రాశారు. రబీ పంటకు సంబంధించి వరి ధాన్యం సేకరణను వారం రోజుల్లో ప్రారంభిస్తామని ప్రకటించడంపై హర్షం వెలిబుచ్చారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి కోతలు కోసి పది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నిల్వ చేసుకునే వసతిలేక నానా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియలో వివిధ జిల్లాల్లో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి గోనె సంచులు సకాలంలో అందడం లేదని, ఆర్బీకేలలో నమోదు చేసిన తేమ శాతాన్ని మిల్లర్లు అంగీకరించకపోవడంతో రైతులు మానసిక ఒత్తిడితోపాటు తక్కువ ధరకు మిల్లర్లకు ధాన్యాన్ని ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన వివరించారు. రైతులకు గోనె సంచులు సకాలంలో అందడం లేదని పేర్కొన్నారు. మధ్య దళారులు, మిల్లర్ల జోక్యాన్ని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నిరోధించలేని స్థితి ఏర్పడిందని, అకాల వర్షాలతో ధాన్యం కల్లాల్లో తడిసిపోయిందని వివరించారు. సకాలంలో లారీలు అందుబాటులో లేక ధాన్యం మిల్లులకు పంపడంలో సమస్యలు ఏర్పడ్డాయని, తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టి మిల్లులకు పంపడంలో వారు పడిన బాధలు వర్ణనాతీతమని తెలిపారు. ఖరీఫ్ ధాన్యం ఉత్పత్తి 74.81 లక్షల టన్నులు కాగా ప్రభుత్వం సేకరించింది కేవలం 35.10 లక్షల టన్నులు మాత్రమేనని, కృష్ణాజిల్లాలో రైతుల నుంచి ఆఫ్‌లైన్‌లో సేకరించిన ధాన్యానికి ఇప్పటికీ మోక్షం లభించలేదని, రబీ సీజన్‌లోనైనా ధాన్యం రైతులు అవస్థలు పడకుండా అమ్ముకునేందుకు చర్యలు చేపట్టాల్సి ఉందని సూచించారు. రైతుల సమస్యలను ముందుగా చర్చించి పరిష్కారానికి వీలుగా వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖాధికారులతోనూ, రైతుసంఘాల ప్రతినిధులతో కేంద్ర, జిల్లాస్థాయిల్లో సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఇళ్లకు 5 లక్షలు ఇవ్వాల్సిందే

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు మృగ్యం

అఖిలపక్ష రౌండ్‌టేబుల్‌లో హరినాథరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం విడనాడి... రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం అధ్వర్యంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ అధ్యక్షతన తిరుపతిలోని బైరాగి పట్టెడలోని పార్టీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. హరినాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ఇంటి పట్టాల పంపిణీ ఆర్భాటంగా జరిగిందే తప్ప...ఆ కాలనీల్లో 10 శాతం ఇంటి నిర్మాణాలు జరిగిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల సొమ్ముతో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఇంతవరకు పంపిణీ చేయలేదని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం జగన్ ప్రభుత్వానికి తగదన్నారు. పెరిగిన ధరలతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఎందుకూ సరిపోవన్నారు. ఈ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాల్లో అభివృద్ధి కన్పించకపోవడం విచారకరమన్నారు. నగరానికి సుదూర ప్రాంతంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడం వల్ల మౌలిక వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగనన్న కాలనీల భూ కొనుగోలు, కేటాయింపుల్లో పెద్ద కుంభకోణం జరిగిందని తెలిపారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలు ఎమ్మెల్యేలకు వరంగా - పేదలకు శాపంగా మారాయని ఆరోపించారు. జగనన్న కాలనీల భూముల కొనుగోలు ద్వారా వైసీపీ నాయకులు కోట్లాది రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు. ఇళ్ల పేరుతో భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి ఇలాంటి దోపిడీకి పాల్పడలేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చే 27 సంక్షేమ పథకాలు రద్దు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రికి అదానీపై ఉన్న ప్రేమ రాష్ట్ర ప్రజలపై లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నదియా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.శివ, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జింక నాగరాజు, పద్మనాభరెడ్డి, గోవిందస్వామి, ప్రమీల, అఖిల, సూరి, ప్రవీణ్, ఓం రాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.12 లక్షల కోట్ల సంపద అదానీకి అర్పితం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

విశాలాంధ్ర-తిరుపతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి గంప గుత్తగా అవినీతికి పాల్పడుతోందని, రూ.12 లక్షల కోట్ల సంపదను అదానీకి దోచి పెట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ విమర్శించారు. బుధవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించిన చిత్తూరు జిల్లా సీపీఐ విస్తృతస్థాయి సమావేశంలో జగదీష్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువల్ని తుంగలో తొక్కిందని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ... విభజన రాజకీయాలకు తెరలేపారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నిత్యావసర ధరలు ఆకాశా న్నంటాయని, రైతాంగం గిట్టుబాటు ధర లేక ఇబ్బం దులకు గురవుతున్నారని తెలిపారు. కార్మికుల్లో అశాంతి నెలకొందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈనెల 14 నుంచి 30 వరకు సీపీఎం తో కలిసి గ్రామస్థాయిలో ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం తొమ్మిది లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించిందని జగదీష్ విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత బయట పడిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళితులపైన దాడులు పెరిగిపోతున్నాయని దళితుల రక్షణ కోసం ఈ నెల 11న 'చలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలోనే వెనుకబడిన చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఆందోళన చేయాలని పిలుపు నిచ్చారు. హంద్రీనీవా ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి అవుతుందో చెప్పే నాథుడు లేడని, చక్కెర కర్మాగారాలు, విజయ డైరీ మూసి వేసి రైతుల నోట్లో మట్టి కొట్టారని మండిపడ్డారు. పంట నష్ట పోయిన మామిడి, టమోటా, పాడి పరిశ్రమ రైతులను ఆదుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు జిల్లాలో పార్టీ కార్య కలాపాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, కోదండ సుబ్రహ్మణ్యం, జయలక్ష్మి, రమాదేవి, మర్కొండయ్య, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రి సీపీఐ కార్యాలయంలో బుధవారం సీపీఐ ఆధ్వర్యాన జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు టి.రంగయ్య అధ్యక్షతన టిడ్కో జగనన్న గృహాలపై అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిలుగా ఆవుల శేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గృహాల పేరుతో ఒక సెంటు స్థలం కేటాయించి పేదలకు తీరని అన్యాయం చేశారన్నారు. కేవలం రూ.లక్షా ఎనభైవేలు మంజూరు చేసి గృహాలు నిర్మించు కోమంటే ఏ విధంగా నిర్మిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సాధారణంగా ప్రస్తుతం ధరలలో ఒక సెంటు స్థలంలో సామాన్యుడు గృహం నిర్మించాలంటే దాదాపు రూ.12 లక్షలు ఖర్చవుతుందని, అలాంటిది ఇంత తక్కువ నగదును మంజూరు చేసి పేద ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా జగనన్న గృహాల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, పెద్దయ్య సీపీఐ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వెంకట్ రాముడు యాదవ్, మండల కార్యదర్శి నాగ రంగయ్య, రైతు సంఘం నాయకుడు నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు వెంకటరమణ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు సీఎం నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్యోద్యమ నేత, సంస్కరణ వాది బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ముఖ్యమంత్రి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రరత్న భవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి

విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పూలమాలలేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, ఉప ప్రధాన మంత్రిగా దేశానికి సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకు లు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు వి.గురునాథం, పీవై కిరణ్, మేడా సురేష్, మీసాల రాజేశ్వరరావు, ఖుర్షీదా, పీటర్ జోసఫ్, వేముల శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడ జింఖానా గ్రౌండ్ దగ్గర గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

తెనాలిలో 10 నుంచి రచయితల, కళాకారుల వర్క్ షాప్

అరసం, ప్రజానాట్య మండలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10, 11, 12 తేదీల్లో తెనాలిలో రచయితలు, కళాకారుల వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం (అరసం), ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి వెల్లడించింది. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం అరసం, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకత్వం సమావేశం నిర్వహించింది. దీనికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అరసం రాష్ట్ర బాధ్యులు జి.ఓబులేసు, ప్రజానాట్య మండలి రాష్ట్ర బాధ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, సిహెచ్. పెంచలయ్య తదితరులు హాజరయ్యారు. కవులు, కళాకారులు నిర్వహించాల్సిన పాత్రపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించారు. దేశంలో అనేక రకాల సమస్యలతో ప్రజలు సతమత మవుతున్నారని, వారి కష్టాలు, బాధలను ఇతివృత్తంగా చేసుకుని రచయితలు వివిధ రకాల కళారూపాల రచనలను చేయాలని, అందుకు ముందుకు వచ్చే వారిని ఆహ్వానించాలని నిర్ణయించారు. జి.ఓబులేసు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో ఈనెల 14 నుంచి మే 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార ఆందోళనలు నిర్వహిస్తున్నామని వివరించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. విపరీతమైన అప్పుల భారాన్ని మోదీ ప్రభుత్వం దేశ ప్రజలపై మోపుతోందని, దేశ సంపదను కొంతమంది వ్యక్తులకు దోచిపెడుతున్నారని ఆయన మండిపడ్డారు. జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ పాలకుల విధానా లపై రచయితలు, కళాకారులు అనేక రకాల కొత్త పాటలు, నాటికలు, నాటకాలు తయారు చేయాలని, అందుకోసం అనేక మందిని కలుపుకుని వెళ్లాలని సూచించారు. చంద్ర నాయక్, పెంచలయ్య మాట్లాడుతూ అన్ని జిల్లాల నుంచి రచయితలు, కళాకారులు, తమ రచనలతో తెనాలి పట్టణంలో ఏప్రిల్ 10 నుంచి 12 వరకు జరిగే శిబిరానికి హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో అరసం నాయకులు శరత్ చంద్ర, చెరుకుపల్లి సింగారావు, ఎస్.వెంకట సుబ్బయ్య, ప్రజానాట్య మండ లి నాయకులు గని, ఆర్.రామకృష్ణ, ఆర్.పిచ్చయ్య, లక్ష్మణరావు, ఆరేటి రామారావు, ఎస్కే నజీర్ పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శనీయుడు జగ్జీవన్‌రామ్ : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అందరికీ ఆదర్శనీయులని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న కొనియాడారు. విజయవాడ ఎస్టీయూ భవన్‌లో బాబు జగ్జీవన్ రామ్, ఎస్టీయూ సంఘం మాజీ ఎమ్మెల్సీ వీణా విజయ రామరాజు వర్ధంతి బుధవారం నిర్వహించారు. వారిద్దరి చిత్రపటాలకు ఎస్టీయూ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులాల అణచివేతలు, విద్వేషాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక సంస్కరణలు తేవడంలో జగ్జీవన్‌రామ్ కీలక భూమిక వహించి విజయం సాధించారన్నారు. బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ రచనలకు అనేక సూచన లిస్తూ రాజ్యాంగ నిర్మాణంలో తనదైన ముద్రవేశారని, కేంద్ర మంత్రిగా ఆ పదవికే వన్నెతెచ్చిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.

క్రమశిక్షణకు మారుపేరు 'వీణా విజయరామరాజు'

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరైన మాజీ ఎమ్మెల్సీ వీణా విజయరామరాజు సంఘంలో క్రమశిక్షణ, నిబద్ధతతో సేవలందిం చార న్నారు. ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు, ఉద్యమాలు నిర్మించిన మహోన్నత వ్యక్తి అని కీర్తించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదుట బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాకుమాను జోజప్పతోపాటు, ఎన్టీఆర్, కృష్ణాజిల్లా ఎస్టీయూ నేతలు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల స్తంభన వద్దు

రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని, పంచాయతీల ఖాతాలలో ఉన్న మొత్తం అన్ని రకాల నిధులను విద్యుత్ బిల్లులకు మాత్రమే చెల్లించాలని 10 రోజుల క్రితం విడుదల చేసిన నిరంకుశ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) ముఖ్య నాయకుల సమావేశం బుధవారం విశాఖ నగరంలోని బీవీకే కాలేజ్ సెంటర్ దగ్గర, పబ్లిక్ లైబ్రరీ మీటింగ్ హాల్‌లో ఛాంబర్ అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీల సర్పంచులు ఎవ్వరు పంచాయతీల కరెంట్ బిల్లులు కట్టవద్దని, ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి 14, 15 వ ఆర్థిక సంఘాల ద్వారా పంచాయతీలకు పంపించిన రూ.8,660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి తన సొంత అవసరాలకు వాడేసుకుందని తెలిపారు. అదేమంటే ఆ డబ్బులు విద్యుత్ బకాయిల కింద జమ వేసుకున్నామని చెబుతూనే, మరలా కరెంట్ బిల్లులు కట్టమని సర్పంచులపై అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన రూ.2,020 కోట్లు వచ్చాయా? వస్తే ఆ నిధులు ఏమయ్యాయి? లేదా గతంలో రూ.8,660 కోట్లు దొంగిలించినట్లే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను కూడా దొంగిలించిందా? అని రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించిన రూ.2,020 కోట్లు, గతంలో రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన రూ.8,660 కోట్లను వెంటనే పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని, అలాగే పంచాయతీల ఖాతాల్లో ఉన్న అన్ని రకాల నిధులను కరెంటు బిల్లుల క్రింద జమ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. లక్ష్మీ ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులను పూర్తిగా నిధులు, విధులు లేకుండా ఉత్సవ విగ్రహాలు లాగా మార్చి వేసిందని, తమ నిధులు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ గౌరవాధ్యక్షులు పుసులూరి నరేంద్ర, ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వినోద్ రాజ్, అనపు రామకృష్ణ నాయుడు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం గౌరవ సలహాదారులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, అనకాపల్లి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు చింతకాయల సుజాత, శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గుండు శంకరరావు, విజయనగరం సర్పంచుల సంఘం నాయకులు సోము నాయుడు, చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్క ధనుంజయ యాదవ్, సర్పంచుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు కోకా ప్రకాష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కుప్పాల మురళి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర నాయకులు కర్రోతు సత్యనారాయణ, గేదెల రాజారావు, తుంపల్లి రమణ, భానోజి నాయుడు, ఎరుక నాయుడు గోవిందరెడ్డి, రౌతు శ్రీనివాసరావు,చాపల మాసేను, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడిగా వల్లూరు శివప్రసాద్

నాటక, సాహితీ రంగ ప్రముఖుల హర్షం

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ నుంచి అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కథా, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సభ్యులను నియమిస్తూ ఒక ప్రకటన విడుదలయింది. వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ప్రముఖ కథా రచయిత్రి వినోదిని, సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ కథా నవలా రచయిత చింతకింది శ్రీనివాసరావులను సభ్యులుగా నియమించారు. వీరు 5 సంవత్సరాలు ఈ బాధ్యతల్లో ఉంటారు. ఈ సందర్భంగా అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ, అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, రాష్ట్ర నలుమూలల నుంచి నాటక రంగ ప్రముఖులు, సాహితీరంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. శివప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

సంపాదకీయం

చరిత్రపై హిందుత్వ దాడి

మహాత్మా గాంధీని హతమార్చింది కరడుగట్టిన హిందుత్వ వాది అని విద్యార్థులు తెలుసుకోవడం ప్రస్తుతం అధికారంలో ఉన్న పక్షానికి ఇష్టం లేదు. ఇలాంటి విషయాలు పాఠ్యపుస్తకాలలో ఉండడం వారికి బొత్తిగా ఇష్టం లేదు. మహాత్మా గాంధీ హిందూ-ముస్లింల ఐక్యత కోసమే ప్రాణత్యాగం చేశారన్న వాస్తవం భావి తరాలకు తెలియడం హిందుత్వ వాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నవారికి ససేమిరా గిట్టడం లేదు. గాంధీ హత్య తరవాత అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ 16 నెలలపాటు ఆర్.ఎస్.ఎస్. ను నిషేధించారని విద్యార్థులకు తెలియడమూ వారికి నచ్చడంలేదు. 2002లో గుజరాత్ మారణకాండ తరవాత అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయి అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీకి రాజధర్మం పాటించాలని హితవు చెప్పినట్టు బాలలకు తెలియడం వారికి సహించదు. అలాగే మొగలుల పాలనాకాలంలో వచ్చిన సంస్కరణలను ప్రస్తావించడమూ నచ్చదు. హిందుత్వ వాదాన్ని అమలు చేయడం మీదే ప్రస్తుత పాలకుల దృష్టి ఉంది. శతాబ్దాలుగా ఈ దేశ సంస్కృతికి ప్రతీకలుగా నిలిచిన రోడ్లు, నగరాలు, కట్టడాలకు మొగల్ రాజుల పేర్లు ఉండడమూ వారికి ఇష్టం లేదు. అందుకే ఎన్.సి.ఇ.ఆర్.టి. పాఠ్య పుస్తకాలలో చారిత్రక సత్యాలను విరూపం చేస్తున్నారు. చరిత్రలోని కొన్ని కీలకాంశాలను తొలగిస్తున్నారు. పాఠ్యపుస్తకాలలోంచి కొన్ని భాగాలను తొలగిస్తున్నారు. కొన్ని కొత్త అధ్యాయాలు చేర్చి తాము ప్రచారం చేస్తున్న సిద్ధాంతానికి అనువుగా పాఠ్య గ్రంథాలను తిరగరాస్తున్నారు. వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలుకూడా ఇదే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి నచ్చే, వారి భావజాలానికి అనుగుణమైన అంశాలను మాత్రమే ఇక మీదట విద్యార్థులు చదవాలన్నది అసలు లక్ష్యం. అంటే మోదీ హయాంలో చరిత్రను తమకు అనుకూలంగా తిరగరాస్తున్నారు. గాంధీ హిందూ-ముస్లింల ఐక్యతకు పాటుపడడంవల్లే హిందుత్వ వాదులు రెచ్చిపోయి గాంధీని హతమార్చారు అని ఇప్పటిదాకా పాఠ్యపుస్తకాల్లో ఉన్న భాగాలను తొలగిస్తున్నారు. అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కూడా పాఠ్యపుస్తకాలను మార్చేపని మొదలైంది. కానీ అప్పుడు ఇంత బాహాటంగా పాలక పక్షానికి నచ్చని అంశాలు తొలగించడానికి సాహసించలేదు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఇప్పటివరకు మూడు సార్లు పాఠ్య పుస్తకాలను తమ భావజాలానికి అనుకూలంగా మార్చేశారు. మొదటిసారి 2017లో 182 పాఠ్య గ్రంథాలలో 1334 చోట్ల ప్రస్తుత పాలకుల సిద్ధాంతానికి అనుకూలంగా మార్పులు జొప్పించారు. ఆ తరవాత 2019లో ప్రకాశ్ జవదేకర్ మానవవనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడూ కొన్ని మార్పులు చేశారు. కరోనా కాలంలో చదువు సరిగ్గా సాగలేదు కనక కొన్ని మార్పులు చేశారు. ఇప్పుడు విద్యార్థులపై భారం తగ్గించడానికి పాఠ్య ప్రణాళికలో కొంత భాగాన్ని తొలగిస్తున్నామంటున్నారు. ఆ భాగాలు ఏమిటి అన్నదే అసలు సమస్య. ప్రధానంగా మొగలుల పాలనకు సంబంధించిన అంశాలను తొలగిస్తున్నారు. కానీ తాము పనిగట్టుకుని మొగలుల పాలన గురించిన అంశాలను తొలగించడం లేదని బుకాయిస్తున్నారు. సరే తొలగించారే అనుకుందాం. మరి మొగలుల మీద హిందుత్వ వాదులు దాడులు చేయాలన్న వారి ప్రస్తావనే లేకుండా ఈ దాడి ఎలా సాధ్యం అవుతుంది.

ప్రస్తుతం తొలగించిన పాఠ్యభాగాల్లో మహాత్మా గాంధీ త్యాగం అన్న అంశం కూడా ఉంది. "గాంధీ భావాలు అందరికీ ఆమోదయోగ్యం కాలేదు. తమ పరిస్థితి దారుణంగా ఉండడానికి గాంధీయే బాధ్యుడని వీరు భావించారు. ముఖ్యంగా పరాయిమతం వారి మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకునే వారికి గాంధీ భావాలతో పొసగలేదు. అలాంటివారు పాకిస్తాన్ ఇస్లామిక దేశంగా ఉన్నట్టే భారత్ హిందూ దేశంగా ఉండాలనుకున్నారు. గాంధీ పాకిస్తాన్‌కు, ముస్లింలకు అనుకూలంగా వ్యవహరించారు. ఇలాంటి భావాలు ఉన్నవారు దారితప్పారని గాంధీ భావించారు. భారత్‌ను హిందూ దేశంగా మారిస్తే వినాశనం జరుగుతుందన్నది గాంధీ నిశ్చితాభిప్రాయం. ఆయన హిందూ, ముస్లింల ఐక్యత కోరుకున్నారు గనకే ఆయనను అంతమొందించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. చివరకు 1948 జనవరి 30న గాంధీని హిందుత్వ వాది అయిన నాథూరాం గోడ్సే మట్టుబెట్టారు." ఇలాంటి భాగాలు పాఠ్యపుస్తకాల్లో ఉండడం కచ్చితంగా ప్రస్తుత పాలకవర్గాలకు మింగుడుపడని అంశమే. గాంధీ హత్య తరవాత దేశ విభజన నేపథ్యంలో పెల్లుబికిన విద్వేషాగ్ని చల్లారింది. దానికి ఆర్.ఎస్.ఎస్. లాంటి సంస్థలను నిషేధించడం కూడా కారణం అయి ఉండొచ్చు. కానీ ఈ వాస్తవాలను తొలగిస్తే గాంధీ మరణానికి కారణం ఏమిటో భావితరాలకు ఏమని చెప్తారో. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా ప్రధానంగా చరిత్ర, రాజనీతి శాస్త్రం, సమాజ శాస్త్రంలో అంతకు ముందు తమకు కంటగింపుగా ఉన్న భాగాలను తొలగించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. నాథూరాం గోడ్సేకు ఆర్.ఎస్.ఎస్., హిందూ మహాసభతోనూ సన్నిహిత సంబంధం ఉండేది. కానీ ఈ రెండు సంస్థలకు గాంధీని హతమార్చడంలో పాత్ర ఉందని నిరూపించడం సాధ్యంకాలేదు ఈ మాట కూడా 12వ తరగతి ఎన్.సి.ఇ.ఆర్.టి పాఠ్య గ్రంథాల్లో ఉంది. దీని మీదా బీజేపీ ప్రభుత్వ వేటుపడింది. ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉంది కనక, తాము చెప్పిందే చరిత్ర అని నమ్మించాలని సంఘపరివార్ దీక్ష బూనింది కనక ఇప్పుడు కూడా గాంధీ అమరుడైన రోజున హిందుత్వ వాదులు "నాథురాం జిందాబాద్" అన్న నినాదాలు చేస్తుంటారు. గోడ్సేకు కొన్ని చోట్ల గుళ్లు ఏర్పడ్డాయి. 12వ తరగతి రాజనీతిశాస్త్ర పాఠ్య గ్రంథంలో గుజరాత్ మారణకాండ గురించి ఉన్న రెండు పేజీల మీద సంఘపరివార్ కత్తెర పడింది. రాజకీయాలకోసం మతాన్ని వినియోగించుకోవడం ఘోర పరిస్థితికి దారి తీస్తుంది అని ఉన్న భాగాలనూ తొలగించారు. ఇటీవలే దిల్లీలోని మొగల్ గార్డెన్స్ పేరు అమాంతం అమృత్ ఉద్యాన్‌గా మారిపోయిన క్రమం అందరికీ తెలుసు. పాలకులు మారినప్పుడల్లా చరిత్ర మారదు. కానీ సంఘ పరివార్ ఆకాంక్షలు నెరవేర్చ డానికి బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న పనిఇదే. వసుంధరా రాజే సింధియా రాజస్థాన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసించే పాఠ్య భాగాలు చేర్చారు. ఇందులో మోదీ కీర్తిగానం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అశోక్ గెహ్లోత్ అధికారంలోకి వచ్చిన తరవాత వసుంధరా రాజే హయాంలో చేర్చిన మోదీని పొగిడే భాగాలను తీసేశారు. మోదీ రాసిన ఎగ్జాం వారియర్స్ పుస్తకాన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు కనక ఇష్టానుసారం మార్పులు చేయడానికి వీలుచిక్కి ఉండవచ్చు. భవిష్యత్తులో మరో ప్రభుత్వంవస్తే చరిత్రను మళ్లీ తిరగ రాస్తుందా. అలా చేస్తూ పోతే చరిత్ర నామరూపాలు లేకుండా పోదా!

అరచేతిలో స్వర్గం అనర్థాలకు నిలయం

టెక్నాలజీ మంచితో పాటు చెడు ఫలితాలను కూడా అందిస్తున్నది. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు విస్తృతంగా వినియోగం లోకి వచ్చిన తర్వాత టెక్నాలజీ దుర్వినియోగం కూడా పెరిగింది. కంప్యూటర్లను వాడే వారు కూడా అరచేతిలో ఇమిడిపోయే మొబైల్ ఫోన్లకే అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. పెరిగిన ఇంటర్నెట్ వేగం కూడా సాంకేతిక పరిజ్ఞానం విరివిగా వాడడానికి దోహదం చేస్తున్నది. ప్రపంచంలో ఎలాంటి ఆవిష్కరణలు జరిగినా అవి ఇప్పటివరకూ మానవజీవితం సౌకర్యవంతం కావడానికి ఉపయోగపడ్డాయి. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ పరికరాలు జనబాహుళ్యానికి అందుబాటులోకి వచ్చి, జనజీవన విధానంలో ఒక భాగమై, పనిచేసే విధానంలో అనేక మార్పులు తెచ్చాయి. వైజ్ఞానిక శాస్త్ర ఫలితాలు మానవ ఆరోగ్యంపై కూడా విపరీతమైన ప్రభావం చూపుతున్నాయి. వ్యాధుల నివారణ కోసం మాత్రమే కాకుండా, నూతన వ్యాధుల పుట్టుకకు కూడా అధునాతన పరికరాలు దోహదం చేస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే మొబైల్ ఫోన్ల వినియోగం మరొక ఎత్తు. ప్రపంచంలో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా ఇట్టే మనకు తెలిసేపోయే విధంగా అరచేతిలో ప్రపంచం ఇమిడిపోయింది. సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. మొబైల్ వినియోగం ఎంతగా వ్యాప్తిచెంది, ప్రపంచాన్ని మన కళ్ళెదుట నిలబెట్టిందో, అదే నిష్పత్తిలో మానవ సంబంధాలను, విలువలను విధ్వంసంచేసింది. టెక్నాలజీ దుర్వినియోగం వలన మానవజీవితం అత్యంత దారుణమైన పరిస్థితుల్లోకి చేరింది. సోషల్ మీడియాపై నియంత్రణ లేకుండా పోయింది. నాలుగుగోడల మధ్య జీవితం నడిరోడ్డుకు చేరింది. విలువల విధ్వంసానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం బీజాలు వేసింది. చరవాణి మానవ జీవితాలను చిందరవందర చేసింది. జీవితమంటే సరదాగా గడిపే క్రీడలా తయారైనది. చదువుకున్న వారు, చదువుకోలేని వారు కూడా సోషల్ మీడియాకు బానిసలుగా మారిపోయారు. అసభ్యమైన కంటెంట్ కోసం అర్రులుచాసే యువతరం బయలుదేరి సాంఘిక మాధ్యమాలకు ప్రభావితమై, అనేక అరాచకాలకు ఒడిగడుతున్న మాట వాస్తవం. అడ్డదిడ్డమైన అడల్ట్ కంటెంట్ అడ్డదారుల్లో తొక్కి, విలువల పతనానికి ప్రేరేపిస్తున్నది.

మంచిని పెంపొందించే వీడియోలకు ఆదరణ కరువైనది. జుగుప్సాకరమైన దృశ్యాలు అత్యంత వేగంగా ప్రజాదరణ పొందడాన్ని చూస్తుంటే చెడుపై ఆకర్షణ ఎలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. సమాజం పెడదారిన పడుతున్నది. యువతతో పాటు, చిన్న పిల్లలు కూడా సాంఘిక మాధ్యమాల ప్రభావంతో చెడిపోతున్నారు. తెలిసీ, తెలియని బాల్యదశలోనే తప్పటడుగులు పడుతున్నాయి. అసాంఘిక చర్యలకు ఆలవాలంగా మారుతున్న సాంఘిక మాధ్యమాలను నియంత్రించడంలో అంతర్జాతీయ సమాజం విఫలమైనది. వీక్షకుల విచక్షణకే వదిలేసిన చాలా రకాల అసభ్యకరమైన సైట్లు మానవ విలువలను ధ్వంసంచేసి, జంతుప్రవృత్తిని అలవాటు చేస్తున్నాయి. ప్రపంచాన్ని ఏదో ఉద్ధరిస్తున్నట్టుగా సాగుతున్న దరిద్రమైనభావజాలం మానవ సమాజం లోకి ప్రవేశించింది. ప్రాంక్ వీడియోల ప్రహసనం విశృంఖలంగా కొనసాగుతున్నది. ఇందులో ద్వందార్థ సంభాషణలతో కూడిన అశ్లీలత యువతను పాడుచేస్తున్నది. ప్రేక్షకుల సంఖ్య పెంచుకోవడానికి నగ్నత్వాన్ని జన బాహుళ్యం లోకి విచ్చలవిడిగా వదులుతున్నారు. మరికొంత మంది రీల్స్ పేరుతో, పేరడీలపేరుతో గారడీలు చేస్తున్నారు. చివరికి తమ ఇంటివిషయాలను, నట్టింట జరిగే కార్యకలాపాలను సైతం సోషల్‌మీడియాలో షేర్ చేస్తున్నారు. తమ గొప్ప తనాన్ని చాటిచెప్పడానికి తమ ఇంట్లో ప్రతి అంగుళాన్ని బాహ్య ప్రపంచానికి పరిచయంచేస్తూ మోసగాళ్ళకు ఆస్కారం కల్పిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పుణ్యమా అని కోట్లాది మంది వ్యక్తుల వ్యక్తిగత సమాచారం సైబర్‌నేరగాళ్ళ చేతికిచిక్కింది. దేశవ్యాప్తంగా ఇటీవల సుమారు 67 కోట్ల మందికి సంబంధించిన వ్యక్తిగత డేటా చోరీ జరిగినట్టు సైబర్ క్రైమ్ పోలీసుల అంచనా. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 2 కోట్లమంది, తెలంగాణాకు చెందిన 50 లక్షల మంది వ్యక్తిగత సమాచారం దొంగిలిం చారని చెబుతున్నారు. కోట్లాది మంది ప్రజల గోప్యత అమ్మకానికి పెట్టడం అత్యంతదారుణం. వ్యక్తుల ఈ మెయిల్, ఫోన్‌నెంబర్లను, వారి కార్యకలాపా లను, ఆధార్ నెంబర్లను, పాన్‌కార్డు వివరాలను, బ్యాంకుఎక్కౌంట్లను సేకరించి, అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తున్నది. కేంద్రప్రభుత్వంకూడా దీనిపైస్పందించి మొబైల్, కంప్యూటర్లు వినియోగిస్తున్నవారు మాల్వేర్, బోట్నెట్‌ఇన్‌ఫెక్షన్ల బారినపడకుండా యాంటీ వైరస్‌ను ఏక్టివేట్ చేసుకోవాలని ఇటీవల మొబైల్ సందేశాలు పంపించింది. ఏదిఏమైనా మనకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడం పెద్ద తప్పిదం. ఆధార్, పాన్‌కార్డువంటి వివరాలను, బ్యాంకు వివరాలను గోప్యంగా ఉంచుకోవాలి.

- సుంకవల్లి సత్తిరాజు, మొ:9704903463

చమురు ఉత్పత్తి కోత-ఆర్థిక భారం

అంజన్ రాయ్

ముడిచమురు ఉత్పత్తిలో కోత విధించాలని సౌదీ అరేబియా అకస్మికంగా నిర్ణయించడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన తలెత్తింది. ఈ చర్య ఆర్థిక రంగానికి ఎంతమాత్రం ఉపయోగకరం కాదు. ఆర్థికరంగంపై భారం పడటం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సౌదీ అరేబియా నిర్ణయంతో ఒపెక్ దేశాలతోపాటు ఇతర సభ్యదేశాలు కూడా ముడిచమురు ఉత్పత్తిలో కోత విధించనున్నట్లు ప్రకటించాయి. అంతర్జాతీయ వాణిజ్య రంగంలో ఈ నిర్ణయం కలకలం రేపుతోంది. రష్యా, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇరాక్, అల్జీరియా, ఒమన్ దేశాలు కూడా చమురు ఉత్పత్తిలో కోత విధిస్తున్నట్లు ప్రకటించాయి. మే నెల నుండి ఈ కోత అమలులోకి రానున్నది. బహుశ ఈ సంవత్సరం చివరివరకు ఈ కోత కొనసాగవచ్చునని చెబుతున్నారు. అంటే ఎక్కువకాలం చమురు ఉత్పత్తిపై కోత కొనసాగడం చమురు మార్కెట్‌లో ప్రకంపనలు రేపుతున్నది. చమురు దిగుమతి చేసుకునే దేశాలు ఆర్థికభారాన్ని మోయవలసి ఉంటుంది. కొవిడ్-19 కాలంలోనూ చమురుకోత వల్ల ప్రపంచ ఆర్థికరంగం కుదేలైన విషయం తెలిసిందే. ఈనిర్ణయం అమెరికాను మరింతగా ఆందోళన కలుగుచేస్తున్నది.

తాత్కాలికంగా రోజుకు 2 మిలియన్ బేరళ్ల ముడిచమురు ఉత్పత్తి తగ్గుతుందని అంచనావేశారు. ప్రపంచవ్యాప్త డిమాండ్‌లో రెండు శాతానికి ఇదిసమానమవుతుందని అంచనా వేస్తున్నారు. ఒకేసారి భారీగా ముడిచమురు ఉత్పత్తికోసం అంతర్జాతీయ మార్కెట్‌లలో చమురుధరలు అమాంతంగా పెరిగే అవకాశం ఉంది. ఈ వార్త తెలిసినవెంటనే ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లలో 5.5శాతం ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. చమురు ఉత్పత్తి కోత అకస్మిక నిర్ణయంపై చిన్నచిన్న ఉత్పత్తిదారులు ఏమాత్రం సంతోషంగాలేరని వదంతులు వ్యాపించాయి. అమెరికా ప్రోత్సాహంతో చిన్నచిన్న ఉత్పత్తిదారులు ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించే అవకాశంకూడా లేకపోలేదు. ఈ సంవత్సరం చివరినాటికి బ్యారెల్ ముడిచమురు ధర 100 డాలర్లకు ఎగబాకవచ్చునని చమురు

మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన నేపథ్యంలో ఇప్పుడిప్పుడే ప్రపంచం చేరుకుంటున్న దశలో పొందిన ఫలితాలన్నీ తుడిచిపెట్టుకు పోతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. వడ్డీరేట్లు తాజాగా పెరగనున్నాయి. ఫలితంగా ప్రపంచార్థికమాంద్యంలో సుస్థిరత దెబ్బతింటుంది. ఇదొక పెద్దకుదుపు అవుతుంది.

ఇటీవల సెంట్రల్‌బ్యాంకులు అప్పుడప్పుడు వడ్డీరేట్లు పెంచుతున్నాయి. ఆర్థికమార్కెట్‌లలో ఒడిదుడుకులను నిలువరించి ఆర్థికవ్యవస్థను నిలకడగా ఉంచే ప్రయత్నమే ఇది. ఈ స్థితిలో చమురుధరలు పెరుగుదల తీవ్ర ఆందోళనకు దారితీస్తుంది. ఈప్రభావం అన్ని రకాల వస్తువులపైన ఉంటుంది. సెంట్రల్ బ్యాంకులు ఈ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకుని తగినచర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ముడిచమురు ఉత్పత్తిని తగ్గించడంవల్ల ఆర్థికరంగంపై దాని ప్రభావం తిరుగులేని కష్టాలను కలిగిస్తుంది. ప్రపంచ భౌగోళిక రాజకీయాలపైన కూడా దీని ప్రభావం గణనీయంగా ఉంది. చమురు ఉత్పత్తుల కోతను అమెరికా తీవ్రంగా విమర్శించింది. అధిక ధరలు రష్యా ఉక్రెయిన్‌లపై తన యుద్ధాన్ని కొనసాగించడానికి దోహదం చేస్తాయని అమెరికా చమురు కోతలను విమర్శించింది. గత సంవత్సరం అక్టోబరులో కూడా సౌదీ అరేబియా చమురు ఉత్పత్తిలో కొత విధించింది. అప్పుడుకూడా అమెరికా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. అంతేకాదు..ఈ నిర్ణయం పర్యావసనాలు తీవ్రంగా ఉంటాయని కూడా అమెరికా సౌదీని బెదిరించింది. సౌదీకి వ్యూహాత్మకమైన ఆయుధాలు, ఇతర పరికరాల విక్రయాన్ని గణనీయంగా తగ్గించివేస్తామని అమెరికా బెదిరించింది. గతంలో వలే కాకుండా ప్రస్తుతం సౌదీ అరేబియా అమెరికా బెదిరింపులను పరిగణలోకి తీసుకోవడంలేదు. ఇటీవల సౌదీకి చైనాతో పెరిగిన సాన్నిహిత్యం మరింత ధైర్యం చేకూర్చింది.

ఇటీవల ఇరాన్-సౌదీల మధ్య చైనా సఖ్యత కూర్చింది. ఇది ఈ ప్రాంతంలో రాజకీయ పరిస్థితులను మార్చి వేస్తుందని పరిశీలకులు అంచనావేశారు. అయితే ఇరాన్ ఇప్పటికే అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తుందన్న సందేహాలు సౌదీకి ఉన్నాయి. అణ్వాయుధాలను తమను లక్ష్యంగా చేసుకుని ఉత్పత్తి చేస్తున్నారేమోనన్న సందేహంకూడా సౌదీకి ఉన్నాయి. అయినప్పటికీ చైనా చొరవ తీసుకొని రెండుదేశాల మధ్య సయోధ్యను కుదర్చడం ద్వారా ఈ ప్రాంతంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పగలిగేరు. రష్యా, చైనాలు ఒపెక్ ఇతర చమురు ఉత్పత్తిదేశాలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి సహకరించడం ద్వారా సౌదీ అమెరికాను ఎదురించే శక్తి స్థోమతలను సంతరించుకుంది. చమురు ఉత్పత్తికోత నిర్ణయం తీసుకున్న తర్వాత రష్యా చమురు అమ్మకం ద్వారా ఆదాయాన్ని పెంచుకోగలిగింది. సౌదీ చమురు పరిశ్రమ రోజుకు 5లక్షల బ్యారెళ్ల ఉత్పత్తిని తగ్గించింది. రష్యా కూడా అదేస్థాయిలో ఉత్పత్తిని తగ్గిస్తానని తెలియజేసింది. పశ్చిమదేశాలు రష్యాపై విధించిన ఆంక్షలను తేలికగా అధిగమించి ఆదాయాన్ని పెంచుకోగలిగింది. భారతదేశానికి మాత్రం తక్కువధరతో ముడిచమురును విక్రయించడానికి రష్యా ఇప్పటికీ సిద్ధంగానే ఉంది. అయితే తక్కువ ధరకు కొనుగోలుచేసే ముడిచమురు వినియోగదారులకు ఉపయోగపడకుండా అంబానీ, అదానీలాంటి వారి కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేవిధంగా బీజేపీ నాయకత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ప్రజాప్రయోజనాలకు కాకుండా లక్షలాది కోట్లు కుబేరుల చెంతకే చేరుతున్నాయి.

తీవ్రమైన నీటి సంక్షోభం

టి.వి సుబ్బయ్య

ప్రపంచమంతటా రానురాను నీటి సంక్షోభం తీవ్రమవుతోంది. ఈ సమస్య మన పల్లెలు, పట్టణాలు, నగరాలలో భారతదేశంలో ప్రజలు అనుభవిస్తున్నదే. ఇప్పటికే అనేక నగరాల్లో ప్రజల దాహార్తిని తీర్చలేని నీటి సరఫరా సమస్య ఏర్పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో వాయుకాలుష్యమే కాదు, నీటి సంక్షోభం ఎక్కువే. ఈసారి ఫిబ్రవరి 10వ తేదీ తర్వాత నుంచి నీటిసరఫరా తగ్గింది. ఈ సమస్య ఈ సారి ఎల్‌నినో కారణంగా అనేక దేశాలలో రుతుపవనాలు కాలంలోనే వర్షాలు తగ్గుతాయని వారం క్రితం ప్రపంచ నీటి అభివృద్ధి నివేదిక-2023 హెచ్చరించింది. ప్రత్యేకించి భారతదేశంలో గతంలో ఏనాడు లేనంతగా నీటికొరత ఎదురవుతుందని నివేదిక తెలియజేసింది. దిల్లీలో గత రెండు వారాలుగా అనేక ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ఈ నెలలో ఈ సమస్య మరింత పెరుగుతుందని దిల్లీ జల్ బోర్డు(డీజేబి) ప్రకటించింది. దిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని వేధించడానికే లెఫ్టినెంట్ గవర్నరు నియమించారని భావించారు. దేశరాజధానిలో సమస్యలను తీర్చడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుకు రాదు. పైగా సమస్యలు తీర్చవలసిన బాధ్యత ఆప్ ప్రభుత్వానిదేననిచెప్పి తప్పించుకోవడమే గాక అనేక అధికారాలను లెఫ్టినెంట్ గవర్నరు ద్వారా కత్తిరిస్తోంది. దిల్లీకి హర్యానా ద్వారా ఎక్కువగా నీరు సరఫరా అవుతుంది. హర్యానాలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక చిక్కులు కలిగిస్తున్నందున దిల్లీలో నీటి సరఫరా మరింత తగ్గుతోంది. యమునా నది ద్వారా సరఫరా మరింత తగ్గుతోంది. యమునా నదిద్వారా సరఫరాఅయ్యే నీరు కలుషితంగా ఉంటోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయినా యమునను ప్రక్షాళన చేయడం, కాలుష్య కారకాలను నదిలో వేయకుండా చూడటం, వంటి చర్యలను ప్రభుత్వాలు అంతగా పట్టించుకోవడంలేదు. రోజుకు దిల్లీకి 1150 మిలియన్ల గాలన్ల నీరు అవసరం కాగా, 935 మిలియన్ల గాలన్లు మాత్రమే సరఫరా అవుతోంది. 34 తహసిల్స్ ప్రాంతంలో భూగర్భ నీరే తాగడానికి ఉపయోగిస్తున్నారు.

240 కోట్ల మందికి నీటికొరత

ప్రపంచ జనాభాలో 240 కోట్ల మందికి నీటికొరత ఉంటుందని, ఇందులో భారతదేశంలో సమస్య అత్యంత తీవ్రంగా ఉంటుందని ప్రపంచ నీటి అభివృద్ధి నివేదిక హెచ్చరించింది. వేసవికాలంలో నీటిని మార్కెట్‌లో బంగారంతో సమంగా కొనుగోలు చేయవలసి రావచ్చునని నివేదిక ప్రమాద ఘంటికలును మోగించింది. ప్రపంచజనాభాలో 18శాతం జనం మన

దేశంలోఉన్నారు. అయితే మనకు ప్రపంచంలో 4శాతం నీటి వనరులే ఉన్నాయని నివేదిక అంచనావేసింది. 2031 నాటికి తలసరి నీటి అవసరం 1486 క్యూబిక్ మీటర్లు ఉంటుందని, అయితే 1367 క్యూబిక్ మీటర్ల నీరు మాత్రమే లభ్యమవుతుందని ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి మెట్రోపాలిటన్ నగరానికి చాలా దూరం నుంచి నీరు సరఫరా అవుతోంది. ముంబై తాన్సా, వైతర్న డ్యామ్‌లపైన ఆధారపడుతోంది. దిల్లీకి ఉత్తరప్రదేశ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌ల నుంచి చెన్నయ్‌కి 200కిలో మీటర్ల దూరంలో గల సరస్సుల నుండి అలాగే తెలుగుగంగ ప్రాజెక్టుద్వారా నీరు లభిస్తోంది. పట్టణప్రాంతాల్లో భూ గర్భం నుండి నీరు తీసుకొని బాటిల్స్ ద్వారా నీరు ఎక్కువగా సరఫరాచేస్తున్నారు. ప్లాస్టిక్‌బాటిల్స్‌లోని నీటిలో కనిపించని ప్లాస్టిక్ రేణువులు విడుదలై నీరు కలుషితమవుతుంది. ఇది ఎంతమాత్రం సురక్షితం గాకపోయినా మరో మార్గం లేక తాగుతున్నారు. ఇప్పటికే ముంబైలో కనీసం రెండువేల ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వమే ప్రకటించింది. ప్రతిఏటా దిల్లీ, ముంబై, చెన్నయ్, బెంగళూరు, హైదరాబాదు లాంటిపెద్ద నగరాల్లోనే గాక, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, అనంతపురం తదితర అనేక నగరాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా అవుతున్న దృశ్యాలు మనం చూస్తూనే ఉన్నాం.

పల్లెల్లో 80శాతం తాగునీరు భూగర్భం నుంచి తీసుకుంటున్నారని పట్టణాల్లో 50శాతం ఇదే నీటిని వాడుతున్నారని నీటి వనరుల పార్లమెంటరీ స్థాయీసంఘం తన తాజా నివేదికలో తెలియజేసింది. అలాగే వ్యవసాయానికి మూడింట రెండు వంతులు భూగర్భ జలాన్ని వాడుతున్నారని తెలిపింది. భవిష్యత్ తరాలకు ఆహారం, నీటి భద్రతకు భూగర్భజలమే ఆధారమవుతుందని ఈ నివేదిక నొక్కి చెప్పింది.

పరిష్కారం ఏమిటి?

పర్యావరణ కాలుష్యం భూతాపాన్ని తగ్గించాలి. మనిషి జీవన విధానం ముఖ్యంగా ఆహార అలవాట్లు మారాలి. ప్రస్తుత ఆహారపంటలు ఎక్కువ నీటి వినియోగం పంటలు. వరి, గోదుమ పంటలకు నీరు ఎక్కువ అవసరం. పూర్వం చాలాప్రాంతాల్లో జొన్నలు, సజ్జలు, ఆరికలు, కొర్రలు, సామలు, ఒరిగలు పండించి తినేవాళ్లు. వరి అన్నంలో పెద్దగా పోషకాల విలువ లుండవని ఆరోగ్యజీవనానికి దోహదపడవని ఆరోగ్యనిపుణులు విశ్లేషించారు. వరి షుగర్ వ్యాధి కారకాల్లో ప్రధానమైందని ఆరోగ్యనిపుణులు నిర్ధారిస్తున్నారు. ఇక జల వనరులను కాపాడుకోవాలి. చెరువులు, కుంటలు, సరస్సులు ఆక్రమణలకు గురై నీటినిల్వలు తరిగిపోతున్నాయి. మోటార్ల ద్వారా భూగర్భజలాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది నీటి నిల్వలు పెరగడానికి సహకరించదు. వర్షపునీరు వృధాగా పోకుండా పొలాల్లోనూ కొన్ని చోట్ల గుంటలు తవ్వివాటిని నింపి వాడుకుంటున్నారు. ఇక నగరాల్లో నీటి వినియోగం చాలా ఎక్కువ. అందువల్ల నగరాలను మరింత విస్తరించడం, అభివృద్ధిపేరుతో అపారంగా నిధులు వ్యయం చేయడం సరైన విధానంకాదు.

చైనా, హోండురాస్ మధ్య సత్సంబంధాలు!

సాత్యకి చక్రవర్తి

చైనాతో సంబంధాలకు అనుకూలంగా తైవాన్‌తో తన దశాబ్దాల దౌత్య సంబంధాలకు హోండురాస్ ప్రభుత్వం తెరదించింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను ఏకైక చైనాగా గుర్తిస్తూ, తైవాన్‌తో అన్ని దౌత్య సంబంధాలను తెంచుకుంటున్నట్లు లాటిన్‌అమెరికా ఖండప్రాంతమైన హోండురాస్ ప్రభుత్వం ప్రకటించింది. హోండురస్ తీసుకున్న ఈ తాజానిర్ణయం, దశాబ్దాల తైవాన్ అనుకూల ఆధిపత్యం తర్వాత గత ఏడాది ప్రారంభంలో ఎన్నికైన వామపక్ష పాలన విదేశాంగ విధానాన్ని సూచిస్తుంది. తైవాన్‌లో తిష్టవేసిన అమెరికా రాజకీయపార్టీలు హోండురస్ నిర్ణయంతో ఖంగు తిన్నాయి. అమెరికా వంటి పెట్టుబడీదారీ దేశాల జోక్యంతో తైవాన్ తన మిత్రదేశాలపై బెదిరింపు చర్యలకు పాల్పడుతూ వచ్చింది. గత రెండేళ్లుగా చైనాతో మరింతగా వైరుధ్యంగా ఉన్న తైవాన్, తమతో దౌత్య సంబంధాలను కొనసాగిస్తున్న పదమూడు దేశాలలో కొన్నింటిపై హోండురస్ తీసుకున్న తాజా నిర్ణయం తీవ్రప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే హోండురాస్ తీసుకున్న తాజా విదేశాంగ విధానంలో కొంత అస్పష్టత ఉంది. తైవాన్ చైనా భూభాగంలో విడదీయరాని భాగమని పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ప్రభుత్వం ప్రకటిస్తూనే ఉంది. తైవాన్-చైనాలమధ్య ఘర్షణ తీవ్రంగాఉన్న సమయంలో, హోండురాస్ తీసుకున్న తాజా నిర్ణయం, అమెరికాకు గట్టి షాక్ అనే చెప్ప వచ్చు. 1949లో నెలకొన్న అంతర్యుద్ధంకాలంలో చైనా, తైవాన్ రెండుగా విడిపోయినప్పటినుండి చైనా "ఒక చైనా" విధానానికి గుర్తింపు పొందేందుకు బిలియన్లు ఖర్చు చేసింది. చైనా తైవాన్‌ను తన ప్రావిన్స్‌లలో ఒకటిగానే గుర్తిస్తూ వచ్చింది. అయితే తైపేలో ఎన్నికైన ప్రభుత్వం మాత్రం దీనిని దీర్ఘ కాలంగా వివాదాస్పదం చేస్తూనే వచ్చింది. తాజాగా హోండురాస్ విదేశాంగ మంత్రి గత వారం చైనాకు వెళ్లడంతో తైవాన్‌తో హోండురాస్ సంబంధాల ముగింపుకు మార్గం సుగమమైంది. హోండురస్ అధ్యక్షుడు జియోమారా కాస్ట్రో తన ప్రభుత్వం బీజింగ్‌తో సత్సంబంధాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. హోండురస్ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే, హోండురస్‌తో తన సంబంధాలను మెరుగుపరచనున్నట్లు చైనాప్రకటించింది. చైనా, హోండురస్‌లు తమ దౌత్య సంబంధాలను కొనసాగిస్తున్నట్లుగా చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చున్యింగ్ ట్వీట్ చేశారు. తైవాన్ విదేశాంగ మంత్రి జోసెఫ్ మాట్లాడుతూ హోండురాస్‌లోని తమ రాయబార కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించారు. మెక్సికో అధ్యక్షుడు ఒబ్రదార్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా లాటిన్ అమెరికన్‌దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాల మెరుగుదలకు, సహకారానికి అనేక చర్యలు తీసుకున్నారు. హోండురాస్ ప్రభుత్వ తాజా నిర్ణయం లాటిన్ అమెరికన్ ప్రాంతాన్ని నిర్మించే ప్రక్రియను మాత్రమే బలోపేతం చేస్తుంది.

కర్నాటకలో బీజేపీ ఇంటిబాటే

- ఆ పార్టీ నుంచి సామూహిక వలసలు
- ఈడీ, ఐటీ ప్రయోగించేందుకు ప్రధాని నిర్ణయం
- కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సూర్జేవాలా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సూర్జేవాలా కేంద్రంపై తీవ్ర ఆరోపణలు చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం జాబితా చేయబడిన పార్టీ నాయకులు, అభ్యర్థులపై దాడులు చేయడానికి ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను పంపిందని ఆయన తెలిపారు. ఎన్నికలకు తన సొంత అభ్యర్థులను ఎంపిక చేయడంలో బీజేపీ విఫలమవడం గురించి కాంగ్రెస్ పార్టీ 'వాస్తవ సమాచారం' కలిగి ఉందని అన్నారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో బీజేపీలో 'సామూహిక వలస' జరుగుతోందని సుర్జేవాలా ఆరోపించారు. 'బీజేపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీ చేసేందుకు నిరాకరిస్తున్నారని, బీజేపీ తన అభ్యర్థులను ఎంపిక చేయలేకపోతోందని మా వద్ద ప్రామాణికమైన సమాచారం ఉంది. కర్ణాటకలో బీజేపీలో భారీ వలసలు జరుగుతున్నాయి. దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, వారి బోర్డులు, కార్పొరేషన్ చైర్మన్లు పదుల సంఖ్యలో రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు' అని తెలిపారు. 'అందువల్ల, ప్రధాని మోదీ తన ఆయుధాగారంలో తుది ఆయుధాలను వినియోగించేందుకు నిర్ణయించారు. అది కూడా ఘోరంగా విఫలమవుతుంది. కాంగ్రెస్ నాయకులు, అభ్యర్థులు, సంభావ్య పార్టీపై రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించడానికి వందలాది మంది ఐటీ, ఈడీ అధికారులను కర్నాటకకు పంపినట్లు మాకు సమాచారం ఉంది' అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తగ్గబోదని, పూర్తి శక్తితో ఎన్నికల్లో పోరాడుతుందని ఆయన ఉద్ఘాటించారు. 'కానీ వారి బూటకపు, మోసపూరిత, కల్పిత దాడులు అధికారంలోకి వచ్చే అంచున ఉన్న కాంగ్రెస్‌ను అణచివేయలేవని ప్రధాని మోదీ, ఆయన ఈడీ, ఐటీ తెలుసుకోవాలి' అని సూర్జేవాలా అన్నారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 150 కి పైగా మార్కును దాటి దూసుకుపోతుందని తెలిపారు. 'మీ ఆదాయపు పన్ను, బీజేపీకి చెందిన ఈడీ, ఐటీ విభాగం ప్రజల 'రథ్' అయిన కాంగ్రెస్ 'రథ్'ను 150 ప్లస్ మార్కును దాటకుండా నిరోధించలేవు. మా సమాచారం ప్రకారం రేపటి నుంచి ప్రారంభం కానున్న దాడుల ద్వారా దుర్వినియోగం చేయాలని చూస్తున్న ఈడీ, ఐటీకి చెందిన అధికారులందరికీ కూడా మేము పిలుపునిస్తున్నాము. మీరు బీజేపీ ప్రభుత్వం తరపున చేస్తున్న అన్ని తప్పుడు పనులకు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది' అని సూర్జేవాలా తెలిపారు. కర్ణాటక అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఆదరణ ఉందని, తమ పార్టీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని తెలిపారు. 'సౌకర్యవంతమైన మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. సూర్జేవాలా చెప్పినట్లుగా, అనేక మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బోర్డులు, కార్పొరేషన్ల చైర్మన్లు బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కర్నాటకలో పరిస్థితి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని అందరికీ తెలుసు.

కర్నాటకలో బీజేపీ మునిగిపోతోందని, అధికారంలోకి రాదని బీజేపీ అధిష్టానానికి బాగా తెలుసు. కర్నాటక 2023 ఎన్నికల్లో ద్వేషపూరిత రాజకీయాలు, హిందుత్వ పని చేయవు' అని ఆయన తెలిపారు. మే 10న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 13న ఓట్ల లెక్కింపు జరగనుంది.

మనీశ్ సిసోడియాకు చుక్కెదురు



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టులో ఉపశమనం లభించలేదు. ఆయనకు బెయిల్ ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. మనీలాండరింగ్ కేసులో ఆయన జ్యుడిషియల్ కస్టడీని ఏప్రిల్ 17 వరకు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆయనను మార్చి 9న ఈడీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ రాష్ట్ర మద్యం విధానం రూపకల్పన, అమలులో అవినీతి జరిగినట్లు ఆరోపిస్తూ సీబీఐ ఆయనను ఫిబ్రవరి 26న అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి ఆయన తీహార్ జైలులో ఉన్నారు. ఈడీ ఆరోపణల ప్రకారం మనీశ్ సిసోడియా ఢిల్లీ మద్యం విధానం, మనీలాండరింగ్ కేసులో దర్యాప్తునకు ఆటంకం కలిగించడం కోసం డిజిటల్ సాక్ష్యాధారాలను, 14 ఫోన్లను ధ్వంసం చేశారు. దర్యాప్తునకు చాలా ముఖ్యమైన, తనకు మాత్రమే తెలిసిన అంశాలను ఆయన వెల్లడించడం లేదు. ప్రాథమికంగా చూసినపుడు నేరపూరిత కుట్రకు రూపశిల్పి సిసోడియాయేనని వెల్లడవుతోందని కోర్టు తెలిపింది. సిసోడియా తరపు న్యాయవాది వివేక్ జైన్ వాదనలు వినిపిస్తూ, సిసోడియాపై మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు వెల్లడి కాలేదని చెప్పారు. పీఎంఎల్ఏలోని సెక్షన్ 3 ప్రకారం నేరం వెల్లడైనపుడు మాత్రమే ఆ చట్టంలోని సెక్షన్ 45 వర్తిస్తుందని చెప్పారు. సిసోడియా లేదా ఆయన కుటుంబీకుల బ్యాంకు ఖాతాల్లోకి కనీసం ఒక్క పైసా కూడా రాలేదన్నారు. దర్యాప్తు అధికారులు ఆయన ఇంట్లో తనిఖీలు చేశారని, బ్యాంకు ఖాతాలు తనిఖీ చేశారని చెప్పారు. ఆయనకు వ్యతిరేకంగా మనీలాండరింగ్‌కు సంబంధించి ఎటువంటి ఆరోపణలు లేవన్నారు. మనీలాండరింగ్ కేసులో బెయిలు కోసం మనీశ్ సిసోడియా చేసిన దరఖాస్తుపై తదుపరి విచారణ ఏప్రిల్ 12న జరుగుతుంది.

ముస్లింల మద్దతు కోసం
కాంగ్రెస్ ఆరాటం

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని ముస్లింల మద్దతు కోసం కరపత్రాలతో ప్రచారం ప్రారంభించింది. సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలకు మద్దతివ్వడం వల్ల బీజేపీ బలపడుతోందని, బీజేపీని జాతీయస్థాయిలో ఎదుర్కొనగలిగే సత్తా తమకు మాత్రమే ఉందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. గతంలో జరిగిన ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ కాంగ్రెస్ పార్టీ ఈ కరపత్రాలు ప్రచురించింది.

మైనారిటీలు అధికంగా ఉన్న పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితులను వివరించింది. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఇన్‌చార్జి షానవాజ్ ఆలం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దాదాపు 1,500 మైనారిటీల ఆధిపత్యం గల గ్రామాల్లో ప్రచారం చేశామని చెప్పారు. గతంలో జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ ఈ ప్రచారం చేస్తున్నామన్నారు. ముస్లింలు ఎస్పీకి కానీ, బీఎస్పీకి కానీ ఓటు వేస్తే... ఇతర కులాలవారు ఆ పార్టీలకు ఓటు వేయడం లేదని చెప్పామన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ మధ్య బలమైన పొత్తు ఉన్నప్పటికీ దళితులు ఎస్పీకి ఓటు వేయలేదని, వెనుకబడిన వర్గాలవారు బీఎస్పీకి ఓటు వేయలేదని చెప్పినట్లు తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ బలంగా ఉన్నపుడు బీజేపీ బలహీనపడిన విషయాన్ని తాము ముస్లింలకు వివరించామన్నారు. ప్రాంతీయ పార్టీలకు ఓటు వేయడం వల్ల బీజేపీ బలపడుతోందని చెప్పినట్లు తెలిపారు. దీంతో బీఎస్పీ, ఎస్పీ లేదా ఆర్ఎల్‌డీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేవని ముస్లింలు తెలుసుకున్నారని చెప్పారు.

ప్రజాస్వామ్యవాది ఇందిర

సోనియా, రాహుల్ అలా కాదు

గులాంనబీ ఆజాద్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీతో తనకు దశాబ్దాల అనుబంధం ఉందని, ఆ పార్టీ పట్ల తనకు దురభిప్రాయం లేదని డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ అధినేత గులాం నబీ ఆజాద్ చెప్పారు. అయితే మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పనితీరుకు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వ్యవహార శైలికి చాలా తేడా ఉందని విమర్శించారు. ఆ పార్టీ ప్రస్తుతం చాలా మార్పులకు గురైందన్నారు. నియామకాల సంస్కృతి పైచేయి సాధించిందని వ్యాఖ్యానించారు. గులాం నబీ ఆజాద్ ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించిన ఇందిరాగాంధీ, సోనియాగాంధీ పనితీరులో తేడాను కూలంకషంగా వివరించారు. పార్టీ వ్యవహార శైలిలోనే తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. 'నియామకాల సంస్కృతి' పెరిగిపోయిందని ఆజాద్ చెప్పారు. ఇందిరాగాంధీ వ్యవహార శైలి ప్రజాస్వామ్యబద్ధంగా ఉండేదని, ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా తాను పని చేసిన కాలంలో ఆమెతో చాలా సన్నిహితంగా వ్యవహరించినట్లు తెలిపారు. ఆ రోజుల్లో తాను ఆమెను ఎప్పుడు కావాలంటే అప్పుడు కలిసేవాడినని చెప్పారు. ఇప్పుడు జూనియర్ నాయకులకు అటువంటి అవకాశం ఉండటం లేదన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలవడం గురించి ఇప్పుడు ఆలోచించడం కూడా సాధ్యం కాదన్నారు. అదంతా గత చరిత్ర అని చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడిన తర్వాత ఆ పార్టీ తనను ప్రమాదకారిగా భావిస్తోందన్నారు. తనను కాంగ్రెస్ వ్యతిరేకించినంతగా మరే ఇతర పార్టీ వ్యతిరేకించలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో తనను ప్రశంసించారని, అప్పుడు కాంగ్రెస్ సంతోషించడానికి బదులు బాధపడిందని చెప్పారు. తనకు భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' పురస్కారం ఇచ్చినపుడు కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందన్నారు. తన పార్టీని బీజేపీకి బీ-టీమ్ అని కాంగ్రెస్ విమర్శిస్తోందని, అదేవిధంగా తాను కూడా ఆ పార్టీని విమర్శించగలనని చెప్పారు. కాంగ్రెస్ చేస్తున్నదేమీ లేదన్నారు. బీజేపీ స్వేచ్ఛగా ఎదగడానికి కాంగ్రెస్ అవకాశం కల్పిస్తోందన్నారు. తాను రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన తర్వాత ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోలేదన్నారు. జమ్ముకశ్మీరు కేంద్ర పాలిత ప్రాంతంలో శాసనసభ ఎన్నికలు జరగవలసి ఉన్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సొంతంగా ఆధిక్యతను సాధించిన ఏకైక పార్టీ ఏదీ లేదన్నారు. బీజేపీతో పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ చేతులు కలిపాయన్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గతంలో కాంగ్రెస్‌లో ఉండేవారని, ఆ పార్టీపై శర్మకుగల ఆగ్రహం గురించి తాను రాహుల్‌గాంధీతో అప్పట్లో చెప్పానని ఆజాద్ తెలిపారు. అప్పుడు రాహుల్ స్పందిస్తూ, 'ఆయనను వెళ్లనివ్వండి' అన్నారని తెలిపారు.

మోదీ, బీజేపీతో ఏం సాధిస్తావ్: దిగ్విజయ్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ పెద్దలను విమర్శిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసిస్తున్న జమ్ముకశ్మీరు నేత గులాం నబీ ఆజాద్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ సింగ్ తీవ్ర ఆరోపణలు చేశారు. 40 సంవత్సరాలపాటు పార్టీలో ఉన్న తర్వాత ఆ పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయారని మండిపడ్డారు. బీజేపీ, మోదీ సాయంతో ఏమి సాధించగలరని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత గులాం నబీ ఆజాద్ సొంతంగా డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీని ఏర్పాటు చేశారు. ఆయన 'ఆజాద్' పేరుతో తన జీవిత చరిత్రను రాశారు. ఈ పుస్తకం త్వరలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ఆయన పత్రికలకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో దిగ్విజయ సింగ్ బుధవారం ఓ ట్వీట్ చేస్తూ 'గులాం నబీ సోదరా! కాంగ్రెస్ పార్టీని మీరేం నాశనం చేస్తారు. ఆ పార్టీ గురించి మీరు బయటపెట్టేదేమిటి? మొదట కశ్మీరులో మీ పార్టీని కాపాడుకోండి. 40 ఏళ్ల పార్టీలో ఉన్న తర్వాత మీరు పార్టీకి ద్రోహం చేశారు. బీజేపీ, మోదీ ఊత కర్రల సాయంతో మీరేం సాధిస్తారు' అని ఎద్దేవా చేశారు.

మంత్రులే చర్చను అడ్డుకోవడం విడ్డూరం

పార్లమెంటరీ చరిత్రలో ఇదే మొదటిసారి: చిదంబరం

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌పై పార్లమెంటులో చర్చ జరగకపోవడంపై ఆర్థిక మంత్రి నిరమలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం ఘాటుగా స్పందించారు. సాక్షాత్తు బాధ్యత గల మంత్రులు, అధికార పక్ష సభ్యులు సభకు అంతరాయం కలిగిస్తూ చర్చ జరగకుండా చేయడం భారత పార్లమెంటరీ చరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై పార్లమెంటులో చర్చ జరగకపోవడంపై ఆర్థిక మంత్రి సీతారామన్ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయసభలు స్తంభిస్తున్నాయి... భారత ఆర్థిక వ్యవస్థ విజయ గాథ నుంచి ప్రజల దృష్టిని మళ్లించే వ్యూహాలను ప్రతిపక్షాలు అవలబిస్తున్నాయని ఆరోపించారు. సీతారామన్ వ్యాఖ్యలపై బుధవారం చిదంబరం ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ... 'గౌరవనీయమైన ఎఫ్ఎం... బడ్జెట్‌పై పార్లమెంటులో చర్చ జరగలేదని విలపించారు... చర్చ లేకుండా బడ్జెట్ ఆమోదించబడడానికి ఎవరు బాధ్యత వహిస్తారు? చర్చ జరగకుండా ట్రెజరీబెంచెస్ (సభలో ముందు వరుసలో కూర్చునే మంత్రులు, సీనియర్ సభ్యులు) గందరగోళాన్ని సృష్టించడం భారత పార్లమెంటరీ చరిత్రలో ఇది మొదటిసారి' అని అన్నారు. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం... మోదీ ప్రభుత్వ ఐదేళ్ల సగటు వృద్ధి (2019-2024)రేటు 4.08 శాతంగా ఉందని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. 'కరోనా ప్రభావిత సంవత్సరం తర్వాత వరుస వార్షిక వృద్ధి రేట్లు కూడా క్షీణిస్తున్న ధోరణినే చూపుతున్నాయి. వృద్ధి రేటు గురించి గొప్పలు చెప్పుకునేది ప్రభుత్వం మాత్రమే' అని ఎద్దేవా చేశారు.

సూట్‌కేసు కంపెనీతో అదానీకి బొగ్గుగని

న్యూఢిల్లీ: గుజరాత్‌కి చెందిన చిన్న సంస్థ అదికార్ప్‌తో అదానీ గ్రూపునకు గల సంబంధాలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మరో అంశాన్ని తెరపైకి తెచ్చింది. మార్చిలో ప్రభుత్వం నిర్వహించిన వాణిజ్య బొగ్గు గనుల వేలంలో గనులు గెలుచుకున్న కంపెనీల్లో అదానీ గ్రూపు ఒకటి. అత్యంత తక్కువ ధరలకు నాలుగు బొగ్గు గనులను కైవసం చేసుకుంది. వాటిల్లో ఒక బ్లాక్ పేరు నార్త్ వెస్ట్ ఆఫ్ మాధేరి. ఈ బొగ్గు గనికి జరిగిన వేలంలో అదానీ కాకుండా కేవిల్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో మరో బిడ్డర్ ఒక్కటే ఉంది. ఈ కేవిల్ మైనింగ్ లిమిటెడ్ యజమాని అదికార్ప్ ఎంటర్‌ప్రైజెస్ ప్రధాన ప్రమోటర్‌గా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. అదానీ కంపెనీల మధ్య నిధులకు మార్గనిర్దేశనం చేయడానికి ఉపయోగించే చిన్న ప్రైవేట్ కంపెనీ అదికార్ప్ అని హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌లో వెల్లడైంది. దీంతో తాజాగా అదికార్ప్‌తో అదానీ గ్రూపునకు గల సంబంధాలపై దర్యాప్తు జరగాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అదానీ గ్రూపు వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ జీవితచరిత్ర ఇటీవలే ప్రచురితమైంది. అందులో షాను తన స్నేహితుడిగా పేర్కొంటూ సుడొకు పజిల్స్‌ను సాల్వ్ చేయడంలో తనతో పోటీ పడలేడని అదానీ గొప్పగా చెప్పుకున్నారు.

మైనింగ్ రంగంలో ఎలాంటి అనుభవం లేని కేవిల్ మైనింగ్, లక్ష రూపాయల పెయిడ్ అప్ కేపిటల్‌తో అదానీ అనుబంధ సంస్థ అయిన ఎంహెచ్ నేచురల్ రీసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పోటీ పడింది. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో గల నార్త్‌వెస్ట్ ఆఫ్ మాధేరి బ్లాక్ మైనింగ్ బ్లాక్‌లో దాదాపు 20కోట్ల టన్నుల బొగ్గు ఉందని అంచనా. ఈ బొగ్గు గని కోసం వేలం నిర్వహించినపుడు అదానీ ఒక్కరే బిడ్డర్ అయితే వేలం రద్దు అయి ఉండేది. కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ నిబంధనల ప్రకారం వాణిజ్య బొగ్గు గని వేలానికి కనీసం ఇద్దరు బిడ్డర్లు ఉండాలి. అప్పుడే ఆ వేలం చెల్లుబాటు అవుతుంది. బొగ్గు గనుల వేలం విషయాల్లో కుమ్మక్కు జరిగిందని గతంలో కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఎస్పీతో జాగ్రత్త సుమీ!

- ఆ పార్టీ కుల విద్వేషాలు సృష్టిస్తోంది
- దళితులు, ఓబీసీలు, ముస్లింలకు మాయావతి హెచ్చరిక

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ పట్ల దళిత, ఓబీసీ, ముస్లిం వర్గాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి పేర్కొన్నారు.

ఆ పార్టీ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలకు బదులు కుల విద్వేష రాజకీయాలు, అర్థంలేని సమస్యల్ని సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం, బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు బహుజన సమాజం తమ పార్టీతో పెద్ద ఎత్తున ఏకమవుతోందని రెండ్రోజుల క్రితం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో బుధవారం మాయావతి ఈ మేరకు స్పందించారు. పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ ఏర్పాటు చేసిన ఎస్పీ-బీఎస్పీ కూటమిని ప్రస్తావిస్తూ... ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ ఉద్దేశాలు స్వచ్ఛంగా లేవని మాయావతి ఆరోపించారు. 'వాస్తవానికి, ఉత్తరప్రదేశ్ అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలకు బదులుగా కుల ప్రాతిపదికన అర్థంలేని సమస్యలపై ద్వేషపూరిత రాజకీయాలు చేయడం ఎస్పీ స్వభావం' అని ఆమె తెలిపారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. సోమవారం రాయ్‌బరేలిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎస్పీ నాయకుడు స్వామి ప్రసాద్ మౌర్య మాట్లాడుతూ... 90ల నాటి రామ మందిర ఉద్యమ ప్రతిఘటన నినాదాన్ని లేవనెత్తారు, ఇది అతనిపై ఎఫ్ఐఆర్‌కి దారితీసింది. కాన్షీరామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా పాల్గొన్నారు. '1993లో గౌరవ కాన్షీరామ్ జీ ఎస్పీ-బీఎస్పీ కూటమిని మిషనరీ స్ఫూర్తితో ఏర్పాటు చేశారనే వాస్తవం ప్రజల ముందుకు వస్తూనే ఉంది... అయితే ఆ కూటమిలో ములాయం సింగ్ యాదవ్ ముఖ్యమంత్రి అయినప్పటికీ... అతని ఉద్దేశాలు స్వచ్ఛమైనవి కావు... బీఎస్పీ అప్రదిష్టపాల్జేసి దళితుల అణచివేతను కొనసాగించేందుకు ఇలా చేశారు' అని మాయావతి అన్నారు. ఇదే విధంగా ఆ సమయంలో ప్రచారం చేయబడిన అయోధ్య, శ్రీరామ మందిరం, అగ్రవర్ణ సమాజం మొదలైన వాటికి సంబంధించిన నినాదాలు... బీఎస్పీకి అప్రదిష్ట తెచ్చేందుకు ఎస్పీ చేసిన దుర్మార్గమైన, చక్కటి ప్రణాళికతో కూడిన కుట్రగా మాయావతి పేర్కొన్నారు. కాబట్టి దళితులు, ఓబీసీలు, ముస్లిం సమాజం... ఎస్పీ చేసే ఇటువంటి కార్యకలాపాల పట్ల జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉందని మాయావతి తెలిపారు. సోమవారం నాటి కార్యక్రమంలో అఖిలేశ్ మాట్లాడుతూ... దళితులు, ఓబీసీల ఒబిసిల హక్కులు, రిజర్వేషన్‌లను బీజేపీ హరిస్తోందని, వారిని అవమానపరుస్తోందని విమర్శించారు. అయితే సమాజ్‌వాదీ పార్టీ అన్ని వర్గాలను ఏకం చేసి కాషాయ పార్టీకి ఘోర పరాజయం పాల్జేస్తుందని బహుజనులకు విశ్వాసం ఉందని అన్నారు. 'భీమ్‌రావ్ అంబేద్కర్, కాన్షీరామ్ చూపిన బాటలో నడిచే ప్రజలం మనం... మనం బహుజన సమాజ్‌ను చీల్చి చెండాడేందుకు పూనుకున్నవాళ్లం కాదు... వారిని కట్టడి చేసేవాళ్లం' అని ఆయన అన్నారు.

కరోనా విజృంభణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా విజృంభిస్తోంది. గడచిన 24 గంటల్లో 4,435 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం ఉదయం 8 గంటల సమయంలో వెల్లడించింది. కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే 163 రోజుల (గత ఏడాది సెప్టెంబర్) గరిష్ఠానికి వైరస్ ఇన్ఫెక్షన్ల కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసులు 23,091గా ఉన్నాయి. ఇవి క్రితంరోజు కన్నా పెరిగి ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా నమోదైన కేసులతో కలిపి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4,47,33,719 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక మంగళవారం ఒక్కరోజే కరోనాకు 15 మంది మృతి చెందారు. మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లో నలుగురు కరోనాతో చనిపోయారు. ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గుజరాత్, హరియాణా, కర్నాటక, పుదుచ్చేరి, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. కోవిడ్ రికవరీ రేటు 98.76 శాతంగా ఉందని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇక రోజువారీ పాజిటివిటీ రేటు 3.38 శాతంగా ఉంది. మరణాల రేటు 1.19 శాతంగా ఉంది.

చరిత్రను తిరగరాస్తే చెత్తబుట్టలోకే

పాఠ్యపుస్తకాల్లో సిలబస్ తొలగింపుపై కాంగ్రెస్ హెచ్చరిక

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తున్నదని కాంగ్రెస్ బుధవారం ఆరోపించింది. మహాత్మా గాంధీ హత్య, ఆ తర్వాత కొంతకాలం ఆర్ఎస్ఎస్‌పై నిషేధం సహా ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి కొన్ని విషయాలను తొలగించిన తర్వాత ప్రభుత్వం చరిత్రను వక్రీకరించి 'ప్రతీకారంతో వైట్‌వాష్' చేస్తోందని ధ్వజమెత్తింది. చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేసే వారు 'చరిత్ర చెత్తబుట్టలో' పడుతున్నారని ప్రతిపక్ష పార్టీ బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించింది. 'గాంధీజీ మరణం దేశంలోని మతపరమైన పరిస్థితులపై మాయా ప్రభావం చూపింది'. 'హిందూ-ముస్లిం ఐక్యత కోసం గాంధీజీ ప్రయత్నించడం హిందూ అతివాదులను రెచ్చగొట్టింది. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు కొంతకాలం నిషేధానికి గురయ్యాయి. మత రాజకీయాలు దాని ఆకర్షణను కోల్పోవడం ప్రారంభించాయి' వంటి పాఠాలను 12వ తరగతి రాజనీతి శాస్త్రం పాఠ్యపుస్తకం నుంచి తొలగించారు. ఈ అంశంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎంత ప్రయత్నించినా చరిత్రను తుడిచివేయలేరని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. 'మీరు పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేయవచ్చు కానీ దేశ చరిత్రను మార్చలేరు. ఇది బీజేపీ-ఆర్ఎస్ఎస్ వారు కోరుకున్నంత ప్రయత్నించవచ్చు. కానీ వారు చరిత్రను చెరిపివేయలేరు' అని ఆయన అన్నారు. ఈ అంశంపై మీడియా కథనాన్ని ట్యాగ్ చేస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్‌లో 'వైట్‌వాషింగ్ విత్ ఏ వెంగెన్స్' అని అన్నారు. పాఠ్యపుస్తకాల నుంచి మొఘలులు, దళిత రచయితలకు సంబంధించిన అధ్యాయాలను కూడా తొలగించారని మరో నివేదికను ట్యాగ్ చేస్తూ తెలిపారు. 'ఇది పాలక పాలన నిజమైన ఆలోచనను వెల్లడిస్తుంది. ఆర్ఎస్ఎస్ గాంధీపై దాడి చేయడమే కాకుండా డాక్టర్ అంబేద్కర్‌ను కూడా తీవ్రంగా వ్యతిరేకించింది' అని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. ఇక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఈ సమస్య గురించి అడిగిన ప్రశ్నకు మనీశ్ తివారీ మాట్లాడుతూ చరిత్రను తిరిగి రాయడం ఆర్ఎస్ఎస్, బీజేపీ 'కొనసాగిస్తున్న ప్రయత్నం' అని తెలిపారు. 'ఇలా జరగడం ఇదే మొదటిసారి కాదు... 1998-99లో మొదటి, రెండో ఎన్‌డీఏ ప్రభుత్వాల హయాంలో ఈ ప్రత్యేక ప్రాజెక్టును ఆవిష్కరించడం నాకు గుర్తుంది. మీరు చరిత్రను వక్రీకరించవచ్చు. కానీ మీరు దానిని తుడిచివేయలేరు అని మాత్రమే చెప్పాలనుకుంటున్నాను' అని ఆయన అన్నారు. 'సత్యం వ్యక్తమయ్యే మార్గం ఉంది. చరిత్రను తిరిగి రాయడానికి ప్రయత్నించిన వారు 'చరిత్ర చెత్తబుట్టలో' పడవేయబడ్డారని చరిత్ర సాక్ష్యంగా ఉంది' అని తివారీ అన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే కూడా ఈ విషయంపై బీజేపీపై విరుచుకుపడ్డారు. వారు 'కొత్త చరిత్ర' రాయడం ద్వారా మహాత్మా గాంధీ సహకారాన్ని చెరిపివేయాలనుకుంటున్నారని ఆరోపించారు. ఎన్‌సీఈఆర్‌టీ కొత్త 12వ తరగతి పాఠ్యపుస్తకాలలోని కొన్ని పాఠ్యాంశాలను తొలగించడంపై రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ బుధవారం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశానికి అనుగుణంగా, ఆధునిక భారతదేశ చరిత్ర 2014 నుంచి ప్రారంభం కావాలని ఎద్దేవా చేశారు. పాఠ్యపుస్తకాల నుంచి కొన్ని సూచనలను తొలగించే నిర్ణయాన్ని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే సమర్థించారు. భారతదేశ చారిత్రక వాస్తవాలను కాంగ్రెస్ తారుమారు చేసిందని, బీజేపీ గత తప్పిదాలను మాత్రమే సరిదిద్దుతోందని అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో కొన్ని పాఠ్యాంశాలను తొలగించడంపై అడిగిన ప్రశ్నకు, ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ అధికారి మాట్లాడుతూ 'గాంధీపై పాఠ్యాంశాలను తొలగించాలని సబ్జెక్ట్ నిపుణుల ప్యానెల్ సిఫార్సు చేసింది. ఇది గత సంవత్సరం మాత్రమే ఆమోదించబడింది. పర్యవేక్షణ కారణంగా హేతుబద్ధీకరించబడిన విషయ జాబితాలో ఇది పేర్కొనలేదు. జాబితాలో ఏవైనా తొలగించిన విషయాలు ఒకటి లేదా రెండు రోజుల్లో తెలియజేస్తాము' అని అన్నారు.

అది వ్యక్తిగత న్యాయపోరాటం

రాహుల్‌పై సింధియా మండిపాటు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వ్యక్తిగత న్యాయ పోరాటాన్ని ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటంగా ఎందుకు ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీని కేంద్రమంత్రి, బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా ప్రశ్నించారు. భారతదేశ ప్రజాస్వామ్యంతో ఆడుకోవడానికి, మరింత అట్టడుగు స్థాయికి దిగజార్చడానికి వచ్చే అవకాశాలను కాంగ్రెస్ వదులుకోవడం లేదని ఆరోపించారు. రాజకీయంగా వెలుగులో ఉండటం కోసం చేయని ప్రయత్నం లేదని ఎద్దేవా చేశారు. ఇది ప్రజాస్వామ్యం కోసం పోరాటం కాదని, కేవలం ఓ వ్యక్తి కోసం పోరాటమని చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్‌ను ఎంత విమర్శించినా తక్కువే అవుతుందన్నారు. జ్యోతిరాదిత్య సింధియా బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోక్‌సభ నుంచి అనర్హుడైనవారిలో రాహుల్ గాంధీ మొదటివారు కాదన్నారు. గతంలో జయలలిత, ఆజం ఖాన్ కూడా అనర్హత వేటుకు గురయ్యారని గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రమే ఎందుకు గగ్గోలు పెడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు నల్లదుస్తులు ఎందుకు ధరిస్తున్నారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ప్రత్యేకంగా పరిగణిస్తున్నారన్నారు. ఆయన కోర్టుకు వెళ్లినపుడు కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున ఆయనతోపాటు వెళ్లారన్నారు. ఇది న్యాయ వ్యవస్థపై ఒత్తిడి చేయడం కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. ఇవి గాంధీయవాద రాజకీయాలా అని నిలదీశారు. తాను గాంధీనని, గాంధీ క్షమాపణ చెప్పరని రాహుల్‌గాంధీ చెప్పడం చాలా ఆశ్చర్యం కలిగిస్తోందని సింధియా అన్నారు. గాంధీ కుటుంబీకులకు ప్రత్యేక నిబంధనలు ఉండాలని ఓ సీనియర్ కాంగ్రెస్ నేత అన్నారన్నారు. దీనినిబట్టి కాంగ్రెస్ దృష్టిలో కొందరు వ్యక్తులు ప్రథమశ్రేణి పౌరులని, మీరు, నేను తృతీయ శ్రేణి పౌరులమని రుజువవుతోందన్నారు.

క్షమాపణ చెప్పినంత మాత్రాన ఎవరూ తక్కువ స్థాయివారు కాదన్నారు. కానీ కొన్ని పార్టీలు దేశం కన్నా తామే గొప్ప అని భావిస్తున్నాయని ఎదురుదాడి చేశారు.

పునరావాసం, పరిహారం ముఖ్యం

విశాలాంధ్ర-విజయవాడ: పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించటం, పరిహారం చెల్లించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ జూన్‌లో వర్షాలు వస్తే ముంపు సమస్య ముందుగా పోలవరం వద్దనే ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్వాసితులకు 30వేల కోట్ల రూపాయలు, ప్రాజెక్టు నిర్మాణానికి 15వేల కోట్ల రూపాయలు కేటాయిస్తే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. మొత్తం 45వేల కోట్ల రూపాయలను ఏడాదికి రూ.15వేల కోట్లు చొప్పున కేటాయిస్తే సమస్య ఉండేది కాదన్నారు. ముఖ్యమంత్రి జగన్ కేంద్రం వద్ద సాగిలపడటం వల్ల పోలవరం పూర్తి కాలేదని ధ్వజమెత్తారు. రివర్స్ టెండరింగ్ ద్వారా సాధించింది ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతి లేకపోయినా, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు అభ్యంతరం చెపుతున్నా మోదీ ప్రభుత్వం కర్నాటక ఎన్నికల దృష్ట్యా ఎగువ భద్ర డ్యామ్‌కు రూ.5,300 కోట్లు కేటాయించిందన్నారు. ఏపీకి 8,900 కోట్లు కేటాయించటం లేదన్నారు. డయాఫ్రం వాల్ సొట్టగా ఉన్నా, చక్కగా ఉన్నా డిజైన్‌కు తగినట్టుగా నిర్మించుకోగల సత్తా మన ఇంజినీర్లకు ఉందన్నారు.

జాతీయస్థాయి ఉద్యమం అవసరం: గిడుగు రుద్రరాజు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాయని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. రాష్ట్ర విభజన చట్టంలో యూపీఏ ప్రభుత్వం పేర్కొన్న విధంగా నిర్వాసితులకు న్యాయం జరగటం లేదని, అందువల్ల దీనిపై జాతీయస్థాయిలో ఉద్యమం చేపట్టాలన్నారు. ప్రాజెక్టు అంటే కేవలం సిమెంటు నిర్మాణం మాత్రమే కాదని, అక్కడి ప్రజలతో అనుబంధం కలిగి ఉంటుందన్నారు. ప్రత్యేకహోదా సాధన సమితి నాయకుడు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోదీ ప్రభుత్వం మోసం చేస్తున్నదని మండిపడ్డారు. బీజేపీకి కొమ్ముకాసే వారిని ఉద్యమంలోకి రాకుండా జాగ్రత పడాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పోలవరం, రంపచోడవరం ప్రాంతాలను కలిపి పోలవరం జిల్లాగా ఏర్పాటు చేసి నిర్వాసితులకు, ఆయా ప్రాంతాల్లోని గిరిజనులకు న్యాయం చేస్తామని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. జాతీయ ప్రాజెక్టుగా నిర్ణయించిన తరువాత పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఎందుకు నిధులు ఇవ్వటం లేదని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రశ్నించారు. కేంద్రంగానీ, రాష్ట్రం గానీ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం గురించే మాట్లాడుతున్నాయి తప్ప నిర్వాసితుల పునరావాసం గురించి స్పందించకపోవడం శోచనీయమన్నారు. విభజన చట్టంలో ఉన్న అంశాలను మార్చవద్దని డిమాండ్ చేశారు. పోలవరం సాధన సమితి అధ్యక్షులు అక్కినేని భవానీ ప్రసాద్ మాట్లాడుతూ పోలవరం ఎత్తు తగ్గించకూడదన్నారు. పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాలని, నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించటం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వటం సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలి సభ్యులు వెంకట్రావ్, షేక్ సాబ్జి మాట్లాడుతూ వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులను వివరించారు. ముంపు మండలాల వారికి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు యెర్నేని నాగేంద్రనాథ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.పొలారి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు హరినాథ్, ఎంసీపీఐ నాయకులు ఖాదర్‌భాష, ఎస్‌యూసీఐ నాయకులు సుధీర్, ఎంఎల్ పార్టీ నాయకులు వీరబాబు తదితరులు ప్రసంగించారు. పోలవరం ముంపు బాధితులు తమ కష్టాలను నాయకులకు, మీడియాకు వివరించారు.

పునరావాసం బాధ్యత కేంద్రానిదే: శ్రీనివాసరావు

శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నంత మాత్రాన కేంద్రం తన ప్రాథమిక బాధ్యత నుంచి తప్పుకోజాలదన్నారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల పరిధిలో 8 మండలాలు దేవిపట్నం, చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు ఉన్నాయని తెలిపారు. పోలవరం నిర్మాణం పూర్తైతే 1,06,006 కుటుంబాలు సంపూర్ణంగా నీటమునుగుతాయని చెప్పారు. ఆ కుటుంబాలన్నింటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతంలో 15 శాతం భూములు కేటాయించాలని, తద్వారా పోలవరం ఫలాలు నిర్వాసితులకు అందుతాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తప్పుల తడకగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చి 2022 వరదల ముంపును ప్రామాణికంగా తీసుకొని రీ సర్వే చేయాలని సూచించారు.

విశాఖ ఉక్కు రక్షణకు సహకరించండి

చంద్రబాబుకు జేఏసీ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిరక్షణకు సహకరించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జేఏసీ నేతలు బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. విశాఖ విమానాశ్రయంలో చంద్రబాబును కలిసి ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉక్కు ఉద్యమ జేఏసీ చైర్మన్, ఏఐటీయుసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, మరో చైర్మన్ మంత్రి రాజశేఖర్ సారధ్యంలో నేతలు మాజీ సీఎం చంద్రబాబును కలిశారు. విశాఖ ఉక్కు వ్యూహాత్మక విక్రయాల ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని, విశాఖ ఉక్కుకు ఇనుప గనులు కేటాయించాలని, క్యాపిటల్ రీస్ట్రక్చర్ చేయాలని, పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు బ్యాటరీ-6 నిర్మాణానికి రుణ సౌకర్యం కల్పించాలని, తీసుకున్న బ్యాంకు రుణాలకు వడ్డీలు తగ్గించాలని, వడ్డీపై మారిటోరియం విధించేలా కృషి చేయాలని చంద్రబాబుకు విన్నవించారు. ఎన్ఎండీసీ, సెయిల్ నుండి ముడి సరుకును ఉత్పత్తి ధరకే ఇప్పించాలని, కోల్ ఇండియా రైల్వేతో మాట్లాడి నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేయాలని కోరారు. విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని విస్తరించి నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో భూములు పంచాలని అభ్యర్థించారు. ఎన్‌జేసీఎస్‌లో ఆర్‌ఐఎన్ఎల్, సెయిల్ ఒప్పందం ప్రకారం విశాఖ ఉక్కు కార్మికులకు సెయిల్‌తో సమానంగా వేతన ఒప్పందం అమలు చేయాలని కోరారు. అనేక విభాగాలలో ఖాళీగా ఉన్న 5 వేల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని రానున్న రెండేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు స్టీల్ పరిశ్రమల కంటే అధిక ఉత్పత్తి, లాభాలు తీసుకురావడానికి విశాఖ ఉక్కు పరిశ్రమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కు లాభనష్టాలు, అకుంఠిత దీక్షతో ఉత్పత్తి పెంచేందుకు కార్మికులు, ఉద్యోగులు చేసిన కృషిని వినతిపత్రంలో పేర్కొన్నారు. విశాఖ ఉక్కు చరిత్రను గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం 2021 జనవరి 27న విశాఖ ఉక్కును 100 శాతం అమ్మేస్తామని ప్రకటించిందని, నాటి నుంచి రుణ సౌకర్యం కల్పించడం లేదని, ముడిసరుకు అందజేయలేదని, వడ్డీ రేట్లు పెంచి పరిశ్రమ ఉత్పత్తిని కుంటుపరుస్తూ ఖాయిలా పరిశ్రమగా మార్చడానికి కేంద్రం శక్తివంచన లేకుండా కుట్ర చేసిందని వివరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణతో ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖపట్నంలో లక్షల మంది ఉద్యోగులు, అనుబంధ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోతారని తెలిపారు. 780 రోజుల నుండి కార్మికులు, తెలుగు రాష్ట్రాల ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నా...పోరాటాలు చేస్తున్నా...విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికే మోదీ సర్కారు నిర్ణయం తీసుకుందని, విశాఖ ఉక్కు పరిరక్షణకు జాతీయస్థాయిలో కృషి చేయాలని చంద్రబాబును జేఏసీ నేతలు కోరారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు గవర్నర్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత తొలి ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రాజ్‌భవన్ దర్బార్ హాలులో బుధవారం పూలమాలలేసి నివాళులర్పించారు. బాబూ జగజ్జీవన్‌రామ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులని, చట్టసభలకు అనేక సార్లు ప్రాతినిథ్యం వహించారని, సుదీర్ఘకాలంపాటు కేంద్ర మంత్రిగా కొనసాగి, వివిధ పదవులను అధిరోహించారన్నారు. జగ్జీవన్‌రామ్ సేవలు దేశానికి ఆదర్శనీయమని స్పష్టం చేశారు.

ఉత్తరాంధ్రకు చంద్రబాబు చేసిందేమీ లేదు

మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాఖబ్యూరో-విశాఖ: చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చాలాకాలంగా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పట్టించుకోని చంద్రబాబు నాయుడు ఎన్నికలు దగ్గరపడుతుండటంతో సదస్సుల పేరుతో ఈ ప్రాంత ప్రజలను మళ్లీ మభ్యపెట్టడానికి వచ్చాడని అన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భావిస్తే దానికి అడ్డు తగిలారన్నారు. ఇక్కడ స్టేట్ గెస్ట్ హౌస్ నిర్మించాలనుకుంటే కోర్టులో కేసులు వేసి దానిని అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తాజాగా చంద్రబాబు నాయుడు సామాజిక న్యాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. విజయవాడ నడిబొడ్డున 140 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, బాబు జగ్జీవన్ రామ్, పూలే విగ్రహాలు కూడా తమ ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఆయనకి ఎప్పుడైనా వచ్చిందా? అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తి సామాజిక న్యాయం గురించి మాకు నీతులు చెప్తారా? అని మండిపడ్డారు.

'పద్మ' అవార్డులు అందుకున్న కీరవాణి, చినజీయర్

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం వేళ దేశంలోని అనేకరంగాలకు చెందిన ప్రముఖులకు కేంద్రం ప్రకటించిన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం (రెండో సెషన్) సందడిగా జరిగింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ ఏడాది మొత్తం 106 పద్మ పురస్కారాలను ప్రకటించగా.. మార్చి 22న తొలి విడతలో 50మందికి పైగా 'పద్మ' అవార్డులు ప్రదానం చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం సాయంత్రం మిగిలిన వారందరికీ పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను అందజేసి గౌరవించారు. తెలుగు రాష్ట్రాలనుంచి త్రిదండి చినజీయర్ స్వామి పద్మభూషణ్ అందుకోగా.. సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. ములాయం సింగ్ యాదవ్‌కు కేంద్రం ప్రకటించిన పద్మవిభూషణ్‌ను ఆయన తనయుడు అఖిలేశ్ యాదవ్ అందుకున్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. వీరితో పాటు మిగతా ప్రముఖులు 'పద్మ' పురస్కారాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి కీరవాణి-రాజమౌళి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు.

'వారెవ్వా జతగాళ్లు' పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-సామర్లకోట: తమిళనాడులో జరిగిన ఒక యదార్థ గాథ ఆధారంగా రూపొందించిన చిత్రమే 'వారెవ్వా జతగాళ్లు' చిత్రీకరణ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం స్థానిక బ్రౌన్ ఫ్లాట్ సెంటర్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఇతర ప్రముఖులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశం చిత్ర దర్శకుడు సలాది సత్య మాట్లాడుతూ... ఎవరు ఊహించని రీతిలో తమిళనాడు రాష్ట్రంలో జరిగిన ఒక యదార్థ గాథను తెరకెక్కించినట్లు తెలిపారు. ఒక గ్రామంలో అల్లరి చిల్లరగా తిరిగే నలుగురు స్నేహితులు ... అదే గ్రామ ప్రజల చేత 'వారెవ్వా జతగాళ్లు' అని పిలిపించుకునే రీతిలో సాధించిన విజయగాథపై ఈ చిత్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. కామెడీ, ఎమోషన్, సెంటిమెంట్ అన్ని అంశాలను కలగలిసి ఉంటాయన్నారు. ఈ చిత్రం గ్రాఫిక్స్ దాదాపుగా పూర్తవుగా ప్రస్తుతం చిత్రం సెన్సార్ బోర్డులో ఉందన్నారు. త్వరలోనే విడుదలయ్యే ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు. పెద్దాపురం మహారాణి కాలేజీలో చదువుకున్న తాను ఇదే కళాశాలలో ఫిలిం అకాడమీ నిర్వహిస్తూ అనేకమంది పేద కళాకారులను ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. ఈ సినిమాలో హీరో లక్ష్మణ్ మాట్లాడుతూ... చిన్నతనం నుంచి నటనపై ఆసక్తి గల తాను అనేకసార్లు హైదరాబాదులో జరిగిన ఫిల్మ్ ఎడిషన్లలో పాల్గొని నిరాశ చెందినట్లు చెప్పారు. చివరగా దర్శకుడు సత్య తనను ప్రోత్సహించి 7 నెలల పాటు నటనలో శిక్షణ ఇచ్చి హీరోని చేయడం గర్వంగా ఉందన్నారు. తనకు వచ్చిన అవకాశాన్ని తాను సద్వినియోగపరచుకున్నట్టు ఆయన తెలుపుతూ ఈ సినిమా మంచి ఆదరణ పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు కేబీ ఆనంద్, రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజేష్, కౌన్సిలర్లు, కళాకారులు పాల్గొన్నారు.

'వార్ 2'లో ఎన్టీఆర్?

హైదరాబాద్: బాలీవుడ్ స్టార్స్ హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్ సక్సెస్ సాధించి బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా 'వార్2' రానుంది. 'బ్రహ్మాస్త్ర' దర్శకుడు అయాన్ ముఖర్జీ ఈ సీక్వెల్‌కు దర్శకత్వం వహించనున్నారు. అయితే ఈ సినిమా గురించి ఓ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. ఈ చిత్రంలో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌కు మధ్య యాక్షన్ సన్నివేశాలు హోరా హోరీగా ఉండనున్నాయని వినికిడి. ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న యశ్ రాజ్ ఫిల్మ్స్ సన్నిహిత వర్గాలు ఓ బాలీవుడ్ మీడియాతో మాట్లాడుతూ... 'వార్2'లో నటించడానికి ఎన్టీఆర్ అంగీకరించినట్లు తెలిపాయి. అంతే కాదు ఈ సీక్వెల్ కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తుందని అంటున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు కానీ తారక్ మాత్రం ఈ భారీ యాక్షన్ మూవీలో నటించడం ఖాయమనే అంటున్నారు. 'వార్2' షూటింగ్ ఈ ఏడాది చివరలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఎన్టీఆర్... కొరటాల శివ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమాలో నటిస్తున్నాడు.

దీన జనబాంధవుడు జగ్జీవన్‌రామ్

జల్లి విల్సన్ నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: సామాజిక వివక్షతను రూపుమాపటానికి అహర్నిశలు పరితపించి కడవరకు రాజీలేని పోరాటం కొనసాగించిన రాజకీయ మేరునగ ధీరుడు, దీన జనబాంధవుడు బాబూ జగ్జీవన్ రామ్ అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. మాజీ ఉప ప్రధాని, దళితుల పక్షపాతి, రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడిన బాబు జగ్జీవన్ రామ్ 115వ జయంతి దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప అధ్యక్షతన విజయవాడ శిఖామణి సెంటర్‌లో బుధవారం జరిగింది. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన జగ్జీవన్ రామ్ ఉప ప్రధానిగా, హోం మంత్రిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయటానికి కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. రాజకీయ పబ్బం కోసం మతాల పేరుతో, కులాల పేరుతో ప్రజల మధ్య అంతరాలు సృష్టిస్తున్నదని విమర్శించారు. దళిత, గిరిజనులకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను అమలు చేయటం లేదన్నారు. సంపద సృష్టించే కార్మికులకు శ్రమకు తగిన ప్రతిఫలం లభించటం లేదన్నారు. జగ్జీవన్‌రామ్ కేంద్రమంత్రిగా పనిచేసిన కాలంలో కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసి ప్రత్యేక చట్టాలు రూపొందించారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి లేబర్‌కోడ్‌లుగా మార్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్‌లు లేకుండా చేస్తున్నదన్నారు. బీజేపీ అనుసరిస్తున్న కుల, మతతత్వ రాజకీయాలను ఎదుర్కొని జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో పోరాడాలని జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. డీహెచ్‌పీఎస్ నాయకులు కొడాలి ఆనందరావు, కాళ్ల చిన్నప్ప, కొండపల్లి కృష్ణ, బి.శాంతమ్మ, కాళ్ల విజయ్, ప్రత్తిపాటి రాజు, యు.నారాయణ, పాశం ఆంజనేయులు, రాహేల్ బాబు, బోదాల రూఫస్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టుకు
జగన్ ప్రభుత్వమే శాపం

సీఎం అంగీకారంతోనే ఎత్తు తగ్గింపు: నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయని పాపం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ప్రాజెక్టు వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వం ప్రజల్ని మభ్యపెట్టిన తీరుకు జగనన్న పాపం పథకం అని పేరు పెట్టాలన్నారు. నాలుగేళ్లుగా ప్రాజెక్టు పూర్తి చేస్తున్నామని చెప్పి ఇప్పుడు నెపం కేంద్రం మీద వేస్తు న్నారని తెలిపారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. మనోహర్ మాట్లాడుతూ..పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో అనేక మంది జాతీయ స్థాయి నాయకులతో చర్చలు జరిపారన్నారు. చర్చల్లో భాగంగా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎలాంటి రాజకీయ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి... ప్రజలకు మెరుగైన పాలన అందించే విధంగా ఎలా ముందుకు వెళ్లాలి... వైసీపీ పాలనలో ప్రజల ఇబ్బం దులు... పోలవరం ప్రాజెక్టు... వైసీపీ దాష్టికాలు... వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్న అంశాలపై కూలంకషంగా చర్చించి నట్లు తెలిపారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో సమావేశంలో పోలవరం గురించి పంచుకున్న అంశాలు ఆశ్చర్యాన్ని కలిగించాయని వివరించారు. రాజకీయ ప్రయోజనాలు మినహా ఈ ముఖ్యమంత్రికి ప్రాజెక్టు పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రం నిధులు రీఎంబర్స్ చేస్తామంటే ఎందుకు స్పందించడం లేదో... 41.5 మీటర్ల ఎత్తుకు ఒప్పుకొని ఎందుకు సంతకాలు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజా ప్రయోజనాల కోసం వైసీపీ విముక్త ఆంధ్ర ప్రదేశ్ కోసం అంతా కలసి ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గుంటూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, విజయవాడ నగర అధ్యక్షుడు పోతిన మహేష్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.